

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 28-09-2025 | సంపుటి - 25 | సంచిక -136 | రూ : 4 | పేజీలు: 8


## 3 దశల్లో...

# పంచాయతీ ఎన్నికలు!



- 2 దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు
- నిర్వహణ వ్యయం రూ.350 కోట్లు
- రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ

2లో



2లో

ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా

## అందాల పోటీలు నిర్వహించాం

- హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరమని నిరూపించామన్న ముఖ్యమంత్రి
- శాంతిభద్రతల విషయంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నామని వ్యాఖ్య
- హైదరాబాద్ అంటే ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ అన్న రేవంత్ రెడ్డి

# మహోగ్ర మూసీ

- ఉస్మాన్‌సాగర్ 15 గేట్లు ఎత్తడంతో హైదరాబాద్ నగరానికి భారీ వరద
- 6 వంతెనలపై రాకపోకలు బంద్.. 12 కాలనీల మునక
- ఎంజీబీఎస్‌ను ముంచెత్తిన ప్రవాహం
- ఆర్టీసీ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి: సీఎం



2లో




## పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా

# సీఎం చంద్రబాబు కీలక ప్రకటన

- నేడు పర్యాటక దినోత్సవం
- విజయవాడలో కార్యక్రమం... సీఎం చంద్రబాబు హాజరు
- పర్యాటక రంగ వృద్ధిని 8% నుంచి 20%కి పెంచాలని లక్ష్య నిర్దేశం
- విజయవాడ దసరా ఉత్సవాలను మైసూరు స్థాయిలో ఘనంగా నిర్వహిస్తామని వెల్లడి



పర్యాటక రంగంతోనే రాష్ట్రంలో సమూల మార్పులు తీసుకొచ్చి, ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పర్యాటక రంగం ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచ పర్యాటక తరువాయి 2లో

## దసరా వేళ రావణుడి దిష్టిబొమ్మలకు

# అమెరికా, కెనడా నుంచి ఆర్డర్లు

- విదేశాలకు పాకిన ఢిల్లీ దసరా వేడుకలు
- అమెరికా, కెనడా నుంచి రావణుడి బొమ్మలకు ఆర్డర్లు
- 70 ఏళ్ల చరిత్ర ఉన్న తాత్‌పూర్ మార్కెట్‌లో సందడి
- గతేడాది నష్టాలు, ఈసారి ఆర్డర్లతో కళాకారుల హర్షం
- రెండున్నర అడుగుల రావణుడి బొమ్మల తయారీ

2లో



తెలంగాణలోని పలు జిల్లాల్లో

## భారీ వర్షం..

- జయశంకర్ భూపాలపల్లి, సంగారెడ్డి జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం
- పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షా లు
- పూర్తిగా నీటమునిగిన మూసారాంబాగ్ బ్రిడ్జి

2లో





# తెలంగాణను పునర్నిర్మిద్దాం

- ప్రపంచ నగరాలతో పోటీపడేలా తీర్చిదిద్దుదాం
- కొలువుల పండగలో గ్రూప్-1 విజేతలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- తల్లిదండ్రుల్ని నిర్లక్ష్యం చేస్తే వేతనంలో 10% కోత వేసేలా చట్టం తెస్తామని వెల్లడి
- కొందరు కాలం కలిసొచ్చి గెలిచి.. కారణజన్ములుగా వ్యవహరించారని వ్యాఖ్య

2లో

## ఆటో డ్రైవర్లకు శుభవార్త చెప్పిన

# సీఎం చంద్రబాబు..





2లో

- ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15 వేల ఆర్థిక సాయం
- అక్టోబరు 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు నగదు జమ
- రాష్ట్రవ్యాప్తంగా 2.9 లక్షల మంది డ్రైవర్లకు ప్రయోజనం
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన
- అర్హులైన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని ప్రభుత్వం హామీ
- పెండింగ్ చలాన్లు క్లియర్ చేసుకున్న వారికే వర్తింపు

# పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా... సీఎం చంద్రబాబు కీలక ప్రకటన

(మొదటిపేజీ తరువాయి)

దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పిస్తున్నట్లు కీలక ప్రకటన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పర్యాటక ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని చంద్రబాబు తెలిపారు. "ప్రస్తుతం నిలిచి ఉండే ఒకే ఒక్క 'ఇజం' టూరిజం మాత్రమే. ప్రపంచ దేశాలు పర్యాటకం ద్వారా 2.6 ట్రిలియన్ డాలర్ల ఆదాయం పొందుతున్నాయి. వాటితో పోలిస్తే అపారమైన అవకాశాలున్న మన దేశం, ముఖ్యంగా మన రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందాల్సి ఉంది. 2027 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం" అని అన్నారు. ప్రస్తుతం 8 శాతంగా ఉన్న పర్యాటక రంగ వృద్ధిని 20 శాతానికి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పర్యాటక పెట్టుబడులను ఆకర్షించేందుకు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంలో వేగంగా అనుమతులు, ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే రూ.10,600 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని గుర్తు చేశారు. మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని, రానున్న మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కొత్త హోటల్ గదులను అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. అలాగే, అరకు, పాడేరు, విశాఖ, తిరుపతి, రాయలసీమ వంటి పర్యాటక ప్రాంతాల్లో 10 వేల హోం స్టేలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంపై ఈ సందర్భంగా చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. "రుషికొండపై రూ.450 కోట్లతో ప్యాలెస్ నిర్మించి ప్రజాధనాన్ని వృథా చేశారు. అదే మొత్తాన్ని పర్యాటక రంగంపై ఖర్చు చేసి ఉంటే లక్షల మందికి ఉద్యోగాలు లభించేవి. వారికి పాలనపై అవగాహన లేదు" అని ఆరోపించారు. రాష్ట్రంలోని సాంస్కృతిక, చారిత్రక సంపదను పర్యాటకంగా మలుస్తామని చంద్రబాబు వివరించారు. అమెరికాలోని గ్రాండ్ కానియన్‌కు దీటుగా గండికోట, గుజరాత్‌లోని కచ్ తరహాలో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. తిరుమల, అన్నవరం వంటి పుణ్యక్షేత్రాల్లో 'వెడ్డింగ్ డెస్టినేషన్స్' ఏర్పాటు చేసే ఆలోచన ఉందని తెలిపారు. మైసూరు, కోల్‌కతా నగరాల సరసన నిలిచేలా విజయవాడలో దసరా ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హెల్త్ టూరిజం ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యమిస్తామని, కూచిపూడి, థింసా వంటి కళారూపాలను, అరకు కాఫీ వంటి స్థానిక ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షం

తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి, సంగారెడ్డి జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఈ రోజు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది.ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో పలు జిల్లాల్లో వాగులు పొంగి పొర్లుతున్నాయి. ఇదిలా ఉండగా, హైదరాబాద్‌లో మూసీ నది ఉప్పొంగుతోంది. దీంతో మూసారాంబాగ్ బ్రిడ్జి పూర్తిగా నీట మునిగింది. మూసారాంబాగ్, గోల్నాక బ్రిడ్జిలను అధికారులు మూసివేశారు. ఎంజీబీఎస్ బస్టాండ్ కూడా నీట మునిగింది. అంబర్ పేటతో సహా పలు ప్రాంతాల్లో నీరు ఇళ్లలోకి చేరింది.

## దసరా వేళ రావణుడి దిష్టిబొమ్మలకు అమెరికా, కెనడా నుంచి ఆర్డర్లు

దేశవ్యాప్తంగా దసరా పండుగ సందడి మొదలైంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ వేడుకల్లో రావణుడి దిష్టిబొమ్మల దహనం ప్రధాన ఘట్టం. అయితే ఈ ఏడాది ఈ సంబరాలు సరిహద్దులు దాటి విదేశాలకు పాకాయి. ఢిల్లీలోని ప్రఖ్యాత తాత్తర్‌పూర్ మార్కెట్‌లో తయారైన రావణుడి దిష్టిబొమ్మలకు ఏకంగా అమెరికా, కెనడా నుంచి ఆర్డర్లు రావడం విశేషం. దాదాపు 70 ఏళ్ల చరిత్ర ఉన్న ఢిల్లీలోని టాగూర్ గార్డెన్‌లో గల తాత్తర్‌పూర్ మార్కెట్, రావణుడి దిష్టిబొమ్మల తయారీకి దేశంలోనే ప్రసిద్ధి చెందింది. ఈసారి ఇక్కడి కళాకారులు విదేశీ ఆర్డర్లతో కొత్త ఉత్సాహంతో పనిచేస్తున్నారు. ఐదు దశాబ్దాలుగా ఇదే వృత్తిలో ఉన్న మహేంద్ర అనే 76 ఏళ్ల కళాకారుడు తన ఆనందాన్ని పంచుకున్నారు. "గత ఏడాది మాకు విదేశాల నుంచి ఒక్క ఆర్డర్ కూడా రాలేదు. కానీ ఈసారి ఇప్పటికే అమెరికా నుంచి ఒకటి, కెనడా నుంచి మరొకటి చొప్పున రెండు ఆర్డర్లు వచ్చాయి" అని ఆయన తెలిపారు. రెండున్నర అడుగుల పొడవుతో తయారు చేసిన ఈ రావణ, మేఘనాథ, కుంభకర్ణుడి దిష్టిబొమ్మలను త్వరలోనే కొరియర్ ద్వారా విదేశాలకు పంపేందుకు సిద్ధం చేస్తున్నారు. "ఇంకా సమయం ఉంది కాబట్టి మరిన్ని ఆర్డర్లు వస్తాయని ఆశిస్తున్నాను" అని మహేంద్ర ధీమా వ్యక్తం చేశారు. తన తండ్రి నుంచి ఈ కళను వారసత్వంగా పుణికిపుచ్చుకున్న ఆయన, గతేడాది భారీ నష్టాలు చవిచూశామని, కానీ ఈసారి పరిస్థితి మెరుగ్గా ఉందని అన్నారు.మార్కెట్‌లోని మరో కళాకారుడు మాట్లాడుతూ, తమకు ఇప్పటివరకు దాదాపు 50 ఆర్డర్లు వచ్చాయని, పనులన్నీ చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు. శ్రీరాముడు రావణుడిని సంహరించిన రోజును పురస్కరించుకుని జరుపుకునే విజయదశమి వేడుకలు, ఇప్పుడు తాత్తర్‌పూర్ కళాకారుల నైపుణ్యం ద్వారా విదేశాల్లోని ప్రవాస భారతీయులను కూడా అలరించబోతున్నాయి. ఈ పరిణామం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్నాయనడానికి నిదర్శనంగా నిలుస్తోంది.

## తెలంగాణను పునర్నిర్మిద్దాం

హైదరాబాద్: దేశానికి తెలంగాణ మోడల్‌ను సృష్టించాలని, ప్రపంచంలోని గొప్ప నగరాలతో పోటీపడేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్తగా ఎన్నికైన గ్రూప్1 అధికారులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని, 2047 నాటికి మూడు ట్రిలియన్ ఎకానమీతోపాటు దేశ జీడీపీలో మన భాగస్వామ్యాన్ని 5% నుంచి 10 శాతానికి చేర్చాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2011లో గ్రూప్1 నోటిఫికేషన్ వెలువడితే 2018లో నియామకాలు జరిగాయని, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 19 నెలల్లోనే నియామకాలు పూర్తి చేశామన్నారు. తెలంగాణ భవిత గ్రూప్1 విజేతల చేతుల్లో ఉందని, నవ్వినవారి ముందు జారిపడేలా చేయకూడదని హితవు పలికారు. కొలువుల పండగలో భాగంగా హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో శనివారం గ్రూప్1 విజేతలకు నియామకపత్రాలను అందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... "గ్రూప్1 పరీక్షలకు 4 లక్షల మంది దరఖాస్తు చేసి, 3 లక్షల మంది పరీక్ష రాస్తే 562 మంది ఎంపికయ్యారు.

**వారు నమ్మక ద్రోహులుగా నిలిచారు**

ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో చాలామంది అమరులయ్యారు. కానీ, కొందరు భావదారిద్ర్యం, అవగాహన లోపంతో ఆరు దశాబ్దాలపాటు కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని వారి కుటుంబం కోసం అన్నట్లు చూశారు. కాలం కలిసొచ్చి రెండుసార్లు గెలిస్తే... తామే కారణ జన్ములన్నట్లుగా వ్యవహరించారు. భావోద్వేగానికి లోనైన యువత... నమ్మకం, విశ్వాసంతో బాధ్యత అప్పగిస్తే వారికే అన్యాయం చేసి విశ్వాస ఘాతకులుగా, నమ్మక ద్రోహులుగా నిలిచారు. అలాంటి వారంతా కాలగర్భంలో కలిసిపోతారు.

**ప్రశ్నపత్రాలను పల్లీ బఠానీల్లా అమ్మేశారు**

ఉమ్మడి రాష్ట్రంలో 2011లో గ్రూప్1 పరీక్షలు నిర్వహిస్తే... తెలంగాణ వచ్చాక 2023 వరకు అంటే 12 ఏళ్ల వరకు పరీక్షలు నిర్వహించలేదంటే అంతకుమించిన నిర్లక్ష్యం ఉంటుందా? తెలంగాణ కోసం శ్రీకాంతాచారి, యాదిరెడ్డి, యాదయ్య, కిష్టయ్య ప్రాణత్యాగం చేశారు. వారి ఆత్మబలిదానాల మీద సాధించిన తెలంగాణ స్ఫూర్తి ఎక్కడుంది? గత పాలకులు అమరులను, వారి త్యాగాలను మరచిపోయారు. పీఎస్సీని అంగడి సరకుగా మార్చారు. దాని సభ్యులుగా ఆర్ఎంపీ, ఇతర చిన్న హోదాల్లో వారిని నియమించారు. అలాంటి వారి ఆలోచన ఎలా ఉంటుందో తెలిసిందే. అందుకే ప్రశ్నపత్రాలను జిరాక్స్ కేంద్రాల్లో పల్లీ బఠానీల్లా అమ్మేశారు. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఎస్సీని ప్రక్షాళన చేశాం. మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డిని ఛైర్మన్‌గా... ఐఏఎస్, గ్రేడ్1 మున్సిపల్ కమిషనర్లు, వీసీలను సభ్యులుగా నియమించాం.

## ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా అందాల పోటీలు నిర్వహించాం...

ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించి, ఇది అత్యంత సురక్షితమైన నగరమని నిరూపించామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో రక్షణ, శాంతిభద్రతల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని, శాంతిభద్రతల విషయంలో దేశంలోనే హైదరాబాద్ మొదటి స్థానంలో ఉందని కేంద్రం ప్రకటించిందని ఆయన తెలిపారు. శిల్పారామంలో ఏర్పాటు చేసిన 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో కొత్త టూరిజం పాలసీని తీసుకువచ్చినట్లు తెలిపారు. గోల్కొండ, రామోజీ ఫిల్మ్ సిటీ వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలు హైదరాబాద్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఎకో, మెడికల్, హెల్త్ టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. హైదరాబాద్ అంటే ఓల్డ్ సిటీ కాదని, ఒరిజినల్ సిటీ అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచ ప్రఖ్యాత నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోందని ఆయన అన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## ఆటో డ్రైవర్లకు శుభవార్త చెప్పిన సీఎం చంద్రబాబు...

రాష్ట్రంలోని లక్షలాది మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుభవార్త అందించారు. అర్హులైన ప్రతి డ్రైవర్‌కు రూ.15,000 చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. వచ్చే నెల (అక్టోబర్) 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఈ మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 2.9 లక్షల మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లు ప్రయోజనం పొందనున్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో 'సూపర్ సిక్స్' పథకాలు, ఎన్డీయే కూటమి మేనిఫెస్టో హామీల అమలుపై జరిగిన చర్చలో భాగంగా ముఖ్యమంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. అర్హత ఉన్న ప్రతి డ్రైవర్‌ను ప్రభుత్వం ఆదుకుంటుందని, వారి సంక్షేమానికి అన్ని చర్యలూ తీసుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. "ఈ పథకానికి అర్హులుగా 2,90,234 మంది డ్రైవర్లు ఉన్నారు. ఏదైనా కారణాలతో లబ్ధిదారుల జాబితాలో అర్హులైన వారి పేరు లేకపోతే... వారి సమస్యలను పరిష్కరించి వారినీ లబ్ధిదారుల జాబితాలో చేరుస్తాం. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఆటో డ్రైవర్ల సేవలో స్కీంను వర్తింపచేస్తాం. ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి యేటా రూ.435 కోట్ల ఖర్చు అవుతుంది. గత ప్రభుత్వం రూ.12 వేలు మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం రూ.15 వేలు అందించేందుకు నిర్ణయించింది" అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు సంబంధించిన మరో ముఖ్యమైన విషయాన్ని కూడా సీఎం ప్రస్తావించారు. పెండింగ్‌లో ఉన్న చలాన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమస్యలు ఉన్న డ్రైవర్లు వాటిని క్లియర్ చేసుకున్న వెంటనే వారికి కూడా ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంపై రాష్ట్రంలోని ఆటో, క్యాబ్ డ్రైవర్ల సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## 3 దశల్లో పంచాయతీ ఎన్నికలు!

హైదరాబాద్: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను 3 దశల్లో.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను 2 దశల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఎన్నికల నిర్వహణకు రూ. 350 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించగా ఇందులో రూ.3.08 కోట్లు ఇప్పటికే విడుదలయ్యాయి. రాష్ట్రంలో 1,67,03,168 మంది గ్రామీణ ఓటర్లు ఎన్నికల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది.

**ముఖ్యాంశాలు ఇలా...**

రాష్ట్రంలోని 12,760 గ్రామ పంచాయతీలు, 1,12,534 వార్డులు, 5,763 ఎంపీటీసీలు, 565 జడ్పీటీసీలకు ప్రత్యక్షంగా, 565 మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు (ఎంపీపీలు), 31 జడ్పీ ఛైర్‌పర్సన్ స్థానాలకు పరోక్షంగా ఎన్నికలు జరుగుతాయి. మొత్తం పంచాయతీల్లో వందశాతం ఎస్టీ లున్న పంచాయతీలు 1,248, షెడ్యూల్డ్ ప్రాంతాల్లోనివి 1,289, ఇతర ప్రాంతాల్లోనివి 10,223. రాష్ట్రంలో 11 గుర్తింపు పొందిన పార్టీలు, 31 నమోదు పార్టీలు తమ గుర్తులపై జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పాల్గొంటాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా జరుగుతాయి.

**మహిళా ఓటర్లే ఎక్కువ**

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని మొత్తం 1,67,03,168 మంది ఓటర్లలో 85,36,770 మంది మహిళలు, 81,65,894 మంది పురుషులు.. 504 మంది ఇతరులు.

**సమస్యాత్మక కేంద్రాలు**

రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోసం మొత్తం 31,377 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఇందులో 8,123 సమస్యాత్మక, 8,113 అతి సున్నిత, 515 అత్యంత సున్నితమైనవి. 1,12,720 పంచాయతీ పోలింగ్ కేంద్రాల్లో 19,774 సమస్యాత్మకం, 21,093 అతి సున్నిత, 2,324 అత్యంత సున్నితమైనవి.

**బ్యాలెట్ బాక్సులు**

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు 37,652, పంచాయతీ ఎన్నికలకు 1,35,264 బ్యాలెట్ బాక్సులు అవసరం కాగా 1,18,547 సిద్ధం చేశారు.

**ఎన్నికల సిబ్బంది**

జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు 651 మంది, ఎంపీటీసీ ఎన్నికలకు 2,337 మంది ఆర్వోలు, 2,340 మంది ఏఆర్వోలు, 39,533 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,58,725 మంది ఇతర సిబ్బంది పాల్గొంటారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 4,956 మంది ఆర్వో మొదటి దశ, 14,407 మంది ఆర్వో రెండో దశ, 79,798 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1,03,318 మంది ఇతర సిబ్బంది పాల్గొంటారు.

**ఎన్నికల దశలు ఇలా..**

పంచాయతీ ఎన్నికలు మొదటి దశలో 41 మండలాల్లోని 1,098 చోట్ల జరుగుతాయి. ఇక్కడ 9,324 వార్డులున్నాయి. రెండో దశలో 272 మండలాల్లోని 5,910 గ్రామాల్లో నిర్వహిస్తారు. 52,190 వార్డులున్నాయి. మూడో దశలో 252 మండలాల్లోని 5,752 గ్రామాల్లో చేపడతారు. ఇక్కడ 51,020 వార్డులున్నాయి. మొదటి దశలో 290 జడ్పీటీసీలు, 2,977 ఎంపీటీసీలు, రెండో దశలో 275 జడ్పీటీసీలు, 2,786 ఎంపీటీసీల్లో ఎన్నికలు జరుగుతాయి.

## మహోగ్ర మూసీ

హైదరాబాద్, చంచల్‌గూడ, బేగంబజార్, కేతేపల్లి, న్యూస్‌టుడే: మూసీ నది మహోగ్రరూపం దాల్చింది. 25 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా గరిష్ఠస్థాయిలో ప్రవహించింది. దీంతో హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, చాదర్‌ఘాట్, మూసారంబాగ్ పరిసరాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. మలక్‌పేట్ నియోజకవర్గం పరిధిలో 10 కాలనీలు, అంబర్‌పేట్‌లో రెండు కాలనీలు నీట మునిగాయి. దాదాపు 2వేల ఇళ్లు వరదలో చిక్కుకున్నాయి. ఎంజీబీఎస్ వద్దనున్న కుడి, ఎడమ వంతెనలతోపాటు నార్సింగిలోని మంచిరేవుల కాజ్‌వే, చాదర్‌ఘాట్ లో లెవల్, మూసారంబాగ్, గౌరెల్లి వద్ద వంతెనలపై నుంచి నీరు ప్రవహించడంతో శనివారం రాకపోకలకు అంతరాయం తలెత్తింది. దీంతో హైదరాబాద్ నగరం ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుపోయింది. పలు ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. మరోవైపు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నారాయణపేట జిల్లాలో పెంకుల షెడ్డు కూలి బాలుడు చనిపోగా.. వనపర్తి జిల్లాలో కొట్టుకుపోతున్న వ్యక్తిని పోలీసులు రక్షించి ప్రాణాలను కాపాడారు.

**మూడు గంటల్లో ముంచెత్తి..**

గండిపేట (ఉస్మాన్‌సాగర్) జలాశయానికి 25 కిలోమీటర్ల ఎగువన శంకరపల్లి వద్ద ఉన్న వంతెనపై ఆరు దశాబ్దాల్లో ఎప్పుడూ పది అడుగులకు మించి వరద రాలేదు. శుక్రవారం రాత్రి ఈ వంతెన వద్ద పదహారున్నర అడుగుల ఎత్తులో వరద నీరు గండిపేటకు చేరుకుంది. 35గంటల వ్యవధిలోనే జలాశయం నిండిపోవడంతో రాత్రి 8 గంటలకు ఉస్మాన్‌సాగర్ అన్ని(15) గేట్లు 9 అడుగుల మేర ఎత్తి 35,600 క్యూసెక్కుల ప్రవాహం దిగువకు విడుదల చేశారు. ఆ వరద నగరానికి చేరే సరికి రాత్రి 11గంటల సమయమైంది. దీంతో అర్ధరాత్రి ఎంజీబీఎస్‌ను చుట్టుముట్టి నీరు లోపలికి ప్రవేశించింది. అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేయకపోవడంతో.. ఆస్తి నష్టం ఎక్కువగా జరిగింది. 24 గంటల్లో 2 టీఎంసీల నీరు వదిలినట్లు అంచనా. ఎంజీబీఎస్ ప్లాట్‌ఫాంల వరకు నీరు చేరడంతో లోపల ఉన్న జనం భయంతో బయటకు పరుగు తీశారు.

* రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం అప్పారెడ్డిగూడ వద్ద వాగు పొంగిపొర్లింది. ఓ కారు వాగును దాటేందుకు ప్రయత్నిస్తూ ప్రవాహంలో చిక్కుకుపోగా.. స్థానికులు అందులోని వ్యక్తిని రక్షించారు.
* మూసీ తన హద్దులను తాకుతూ ఉరకలెత్తడంతో.. లంగర్‌హౌస్ వద్దనున్న బాపూఘాట్ నీట మునిగింది.
* పురానాపుల్ వద్ద నదిలో ఉన్న శివాలయంలో పూజారి, ముగ్గురు వ్యక్తులు చిక్కుకోగా.. హైడ్రా, పోలీసు సిబ్బంది వారిని రక్షించారు. నాగోల్ వద్ద వరద ప్రవాహం శిల్పారామం అంచును తాకింది. ఉప్పల్ భగాయత్ లేఅవుట్.. చెరువులా మారింది.
* చాదర్‌ఘాట్ వద్ద వరదలో చిక్కుకుపోయిన రసూల్‌పుర కాలనీకి చెందిన నలుగురు వ్యక్తులు ఇంటిని ఖాళీ చేసేందుకు ససేమిరా అనడంతో.. జీహెచ్ఎంసీ అధికారులు వారికి డ్రోన్ సాయంతో ఆహారం అందించారు.
* మూసానగర్, రసూల్‌పుర, వినాయకవీధి, శంకర్‌నగర్, పద్మాకాలనీ, తదితర ప్రాంతాల్లోని 1,460 మందికి 10 కేంద్రాల్లో పునరావాసం కల్పించి ఆహారం, తాగునీరు, ఇతర సౌకర్యాలను సమకూర్చినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. శనివారం సాయంత్రానికి నదిలో వరద ఉద్ధృతి తగ్గడంతో.. రాత్రికి పరిస్థితి కొంత అదుపులోకి వచ్చింది.
* పై నుంచి వస్తున్న వరదతో నల్గొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ రిజర్వాయర్ నీటిమట్టం భారీగా పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి రికార్డు స్థాయిలో 41,448 క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. అప్రమత్తమైన అధికారులు శనివారం ఉదయం ప్రాజెక్టు తొమ్మిది క్రస్టుగేట్లు ఎత్తి 44,671 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా 3.96 టీఎంసీల నీరు రిజర్వాయర్‌లో ఉంది.

# బతుకమ్మ ఘాట్లలో సౌకర్యాలు కల్పించండి

* **బస్తి, గ్రామ కూడళ్ళల్లో విద్యుత్, పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి**
* **అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కూనంనేని**





ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : బతుకమ్మ పండుగ సందర్భంగా చెరువులు, నదులు, కాల్వలకు సంబందించిన బతుకమ్మ ఘాట్లలో మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సకల సౌకర్యాలు కల్పించాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు శనివారం అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్, గ్రామపంచాయతి, పోలిసు, నీటిపారుదల, విద్యుత్ తదితర శాఖల అధికారులతో అయన ఫోన్లో తగుసూచనలు, సలహాహాలు అందించారు. ఘాట్లలో ప్రమాదాలు చోటుచేసుకోకుండా అత్యవసర నిర్మాణాలు చేపట్టాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని ఆదేశించారు. పోలిసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని. బతుకమ్మ పండుగను మహిళలు సంతోషంగా జరుపుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేసి తగిన ఏర్పాటు చేయాలని సూచించారు. బతుకమ్మ ఆటలు ఆడే గ్రామ, బస్తి సెంటర్లలో, దుర్గామాత మంటపాలు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్, పారిశుద్ధ్యం పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. మహిళల నుంచి ఎలాంటి ఫిర్యాదులొచ్చినా చర్యలకు సిఫారసు చేస్తానని హెచ్చరించారు. జిల్లాకేంద్రంలోని ముర్రేడు వాగు ప్రధాన బతుకమ్మ ఘాట్ అభివృద్ధికి రూ.50లక్షలు మంజూరు చేయించి శంకుస్థాపన చేయడం జరిగిందని, త్వరలో పనులు పూర్తవుతాయని కూనంనేని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు అయన బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## చల్లని చూపులతో త్రిలోకాలను కాపాడే తల్లి దుర్గమ్మ

- **మాజీ ఉప సర్పంచ్ ఎం. కృష్ణ ముదిరాజ్**
- **మహాలక్షి అవతారంలో అమ్మవారు దర్శనం**



అందోలు, ప్రజాస్ఫూర్తి: కనకధార కురిపిస్తూ తన చల్లని చూపులతో త్రిలోకాలను కాపాడే తల్లి శ్రీ మహాలక్ష్మీ దేవి అని మాజీ ఉప సర్పంచ్ ఎం. కృష్ణ ముదిరాజ్ అన్నారు. అందోలు మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామంలో దేవీ నవరాత్రులు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి.శరన్నవరాత్రులలో ఆరో రోజు అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. మాజీ ఉప సర్పంచ్ ఎం. కృష్ణ ముదిరాజ్ మాధవి దంపతులు అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కొలిచే భక్తుల కొంగుబంగారమై విలసిల్లుతున్న అమ్మవారు ప్రజలందరిని కంటికి రెప్పలా కాపాడి రాబోయే దసరా ఉత్సవాలు బతుకమ్మ పండుగలు అమ్మవారు ఆశీస్సులు ఉండాలని కోరారు. ఆదిపరా శక్తి మూడు శక్తులలో ఒక శక్తి అయిన మహాలక్ష్మీ అమిత పరాక్రమంతో మహిషుడనే రాక్షసుడిని సునాయాసంగా సంహరించి మహిషాసురమర్దినిగా పూజలందుకుంది. శరన్నవరాత్రులలో మహాలక్ష్మిని పూజిస్తే సర్వ మంగళ మాంగల్యాలు కలుగుతాయనే నమ్మకంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

## కప్పింగ్ థెరపీ సర్టిఫికెట్ అందుకున్న సుగుణారావు

* **ప్రముఖుల అభినందనలు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రముఖ ప్రకృతి వైద్యులు గా పేరుగాంచడమే కాకుండా, ఆక్యుపంచర్సైన్స్, ఆక్యుప్రెషర్ సైన్స్, ఖైరో ప్రాక్టీస్ (మర్మకల), డ్రగ్లెస్ థెరపీలో హీలర్ గా అంచలంచలుగా ఎదుగుతున్న. హెచ్ఆర్. జి. సుగుణారావు కప్పింగ్ థెరపీ (హిజామా) లో డిప్లమా కోర్సు పూర్తి చేసి, మరో సర్టిఫికెట్ ని అందుకున్నాడు. ఈనెల 24, 25, 26 వ తేదీలలో, విజయవాడలోని 'నేచురల్ హీలింగ్ సెంటర్' ఆధ్వర్యంలో నిర్వహించిన కప్పింగ్ తెరపి డిప్లమా కోర్స్ పూర్తిచేసి, ఆ సంస్థ నిర్వాహకులు, ప్రముఖ ట్రైనర్, డాక్టర్. ఎస్. చెన్నఅప్పారావు చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నట్లు హీలర్ సుగుణారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఆయన్ను కొత్తగూడెంలోనే ప్రకృతి ఆశ్రమం వ్యవస్థాపకులు ప్రముఖ కవి జయరాజు, సభ్యులు డా.బి. కృష్ణయ్య, పర్యావరణవేత్త మొక్కల వెంకటయ్య, మన్ కీ బాత్ మొక్కల రాజశేఖర్, మహమ్మద్ ముస్తఫా, సింగరేణి అవిశ్రాంత జిఎం శనగ వెంకటేశ్వర్లు, ఏజీఎం గోనే శ్రీకాంత్, కె హెచ్ ప్రసాద్, సీనియర్ పాత్రికేయులు తుమ్మలపల్లి ప్రసాద్, తెలుగు వెలుగు ఛానల్, పూర్ణ మొబైల్ అధినేత పూర్ణ చందర్ రావు, ప్రముఖ సింగర్ వెంకట ముత్యం ల తో పాటు, తోటి హీలర్స్ స్వప్న, మంగ, రవికుమార్ అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా సుగుణారావు మాట్లాడుతూ చాలా అద్భుతమైన కప్పింగ్ (హిజామా) పద్ధతుల ద్వారా సున్నత్, డ్రై, ఫైర్, అక్యుపంక్చర్, వాటర్, ఐస్, మాగ్నెట్, మోక్సా, హెర్బల్, మసాజ్ , ఫేషియల్, ఆయిల్ కప్పింగ్ పద్ధతులలో అనేక రకాల మొండి వ్యాధులను తగ్గించేందుకు వైద్య సేవలను అందిస్తానని తెలిపారు.



## ఇందిరమ్మ ఇళ్ళతో పేదల కళ్ళలో ఆనందం

* **ఇందిరమ్మ ఇంటి నిర్మాణ శంకుస్థాపన చేసిన టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ నాగా సీతారాములు తెలిపారు. సింగభూపాలెం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు మంచినీళ్ల జెన్ని ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అందరికీ అభివృద్ధి ఫలాలు అందుతాయి అన్నారు. కావాలనే కొందరు ఇందిరమ్మ ఇళ్ల విషయంలో రాద్ధాంతాలు చేస్తున్నారని అలాంటి వారు తమ పద్దతి మార్చుకోవాలన్నారు. పదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకొని నాశనం చేసిన బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ హయంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు ఆధ్వర్యంలో జరుగుతున్న కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధిని చూడాలన్నారు. ఎంపి రామసహాయం, ఎంపి రేణుక చౌదరి కూడ నియోజకవర్గ అభివృద్ధి కోసం అనేక నిధులు మంజూరు చేయించిన విషయాన్ని పునరుద్ఘాటించారు. గత పది ఏళ్లలో అర్హులకు రేషన్ కార్డు అందించిన ఘనత కాంగ్రెస్ కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా సెక్రటరీ బొబ్బాల వెంకట్ యాదవ్, సింగభూపాలం నాయకులు బైరు సాంబయ్య, పొదిల శ్రీను, చెవుల శ్రీను, కిన్నెర వెంకన్న, బుర్గు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షా లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

* **అత్యవసరమైతే డయల్ 100 నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలు పొందండి**
* **ఎస్పీ రోహిత్ రాజు**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఎడతెరిపి లేకుండా విస్తారంగా కురుస్తున్న వర్షాల వలన జిల్లాలోని నదులు,వాగులు,వంకలు,చెరువులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తూ రోడ్లపైకి నీరు చేరే అవకాశం ఉన్నది. కావున కాలి నడకన మరియు వాహనాలతో ప్రజలు రోడ్లు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు.సెల్ఫీల కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని తెలిపారు. నదులు, వాగులు, వంకల వద్దకు జాలర్లు, ప్రజలు చేపల వేటకు వెళ్ళకూడదని సూచించారు. పశువులను కాయడానికి నదులు, వాగులు, వంకల పరిసర ప్రాంతాల దగ్గరకు వెళ్లకూడదని సూచించారు. సాధ్యమైనంత వరకు అత్యవసర సమయాల్లో తప్ప మిగిలిన సమయాలలో బయటకు రాకుండా ఉండడానికి ప్రయత్నించవలసిందిగా సూచించారు.జిల్లా పోలీసు యంత్రాంగం ఇతర శాఖలతో కలిసి ఇప్పటికే వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారుతున్న రహదారులు , చెరువులు,వాగులు,నదుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలియజేసారు.జిల్లా పోలీస్ శాఖ తరపున 24×7 అందుబాటులో ఉండే విధంగా డిడిఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచడం జరిగిందని తెలిపారు.ప్రజలు ఎవరైనా విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లయితే వెంటనే డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం అందించి పోలీసు వారి సేవలను పొందాలని కోరారు.ప్రమాదాలు వాటిల్లకుండా పోలీసు వారు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## ఐటీఐ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను ప్రారంభించిన ప్రభుత్వ ఆలేరు ఎమ్మెల్యే



ంఆలేరు, ప్రజా స్ఫూర్తి : ఆలేరు పట్టంలోని ఐటీఐ వద్ద అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ముందుగా సెంటర్ ను ప్రారంభించి,సమావేశంలో పాల్గొని, అనంతరం ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించారు,ఆ తర్వాత పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు, ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలతో ప్రతి ఐటీఐ ని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ గా మార్చి విద్యార్థులు మంచి శిక్షణ ఇచ్చి నైపుణ్యంబివృద్ధి చేసి ఉద్యోగ కల్పన లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. ఇందుకు సహకరిస్తున్న టాటా టెక్నాలజీ వారికి మనస్పూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సెంటర్ ఆలేరు నియోజకవర్గ యువత, నిరుద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు..

## రాయల్ డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ చింతల్ లోని రాయల్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ఏడవ రోజు ఆటపాటలతో బతుకమ్మ ఉత్సవాలు హోరెత్తించారు.. ప్రకృతి నుంచి లభించిన రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఉయ్యాల లాగా ఊగుతూ బతుకమ్మ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం నీటిలో వాటిని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో అందంగా పేర్చిన బతుకమ్మలకు కళాశాల డైరెక్టర్లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు జి. రమేష్ బాబు,ఎన్. వెంకట్ రెడ్డి, సిహెచ్.గోవిందరెడ్డి, కే. రామకృష్ణ, జై శంకర్ గౌడ్ , అధ్యాపక , అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : ప్రభుత్వ నిభందనలు ఉల్లఘించి ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్నా ఓ వ్యక్తిని పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో గల హనుమన్ గుడి దగ్గర, బజారంగ్ హిల్స్, వెన్నెలగడ్డ లో బండి వెంకటేష్ గౌడ్ (50) అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తుండగా నమ్మదగిన సమాచారం రాగానే వెంటనే పోలీస్ వారు తనికి చేసి వెంకటేష్ అమ్ముతున్న మద్యం బాటిల్స్ ను సుమారు 07 లీటరు మద్యం స్వాధీన పరుచుకొని అతని పైన పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ కి ఘన నివాళి



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా భారత రాష్ట్ర సమితి వ్యవస్థాపక నాయకులు దిండిగాల రాజేందర్ నాయకత్వంలో శనివారం స్థానిక తెలంగాణ తల్లి జగదాంబ సెంటర్ లో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణలో పురుడుపోసుకున్న అన్ని ప్రజా ఉద్యమాలకు ఆయన ప్రత్యక్ష సాక్షి. తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎదురించి, ఎలుగెత్తి చాటిన అతి తక్కువమంది నాయకుల్లో అగ్రగణ్యులు కొండా లక్ష్మణ్ బాపూజీ. మూడు తరాల ఉద్యమ వారధి బాపూజీ. దేశ స్వాతంత్ర్యం కోసం, నిజాం విముక్త తెలంగాణ కోసం, ప్రత్యేక తెలంగాణ అవతరణ కోసం నినదించిన నిప్పుల గొంతుక ఆయన.96 ఏళ్ల వయసులోనూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పోరాడారు. తెలంగాణ గడ్డమీద పుట్టి, దేశ చరిత్ర పుటలకెక్కిన మహానుభావులలో ఒకడిగా బాపూజీ చిరస్మరణీయుడు. ఈ కార్యక్రమంలో టీబీజీకే ఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సుదర్శన రంగనాథ్ ఇల్లందు టిఆర్ఎస్ పార్టీ టౌన్ ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ, ఎర్రబెల్లి కృష్ణయ్య, దేరంగుల కోసం, రాచపల్లి శీను, మూలగుండ్ల ఉపేందర్,,ఎండి జబ్బార్,సన రాజేష్,నారపాక వసంత్, తుంగపల్లి మహేష్, లలిత్ కుమార్ పాసి,కిషన్ లాల్ పాసి,, సుందర గిరి శీను. పరిక పల్లి రవి, గడ్డి శీను,ఎస్ కే బాబా,కే రాము, నారపాక యాకయ్య, మునిగంటి శివ, వడ్డేపల్లి నిఖిల్,సర్వేవేష్ ఆటో, కమురు,ఎస్ కే ఖాజా, బజారు సత్యనారాయణ, చిన్నారి,ఆయుష్ పాసి,ముజు భాయ్, రాంలాల్ పాసి, మహిళా నాయకులు,ఎస్ కే బిబి, నూర్జహాన్ , మదర్ బి,డి ఉమా, బొపి భాగ్య, మౌనిక, తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఉద్యమకారుడు అనే పదానికి నిలువెత్తు నిర్వచనం కొండా లక్ష్మణ్ బాపూజీ

ప్రజాస్ఫూర్తి ఇల్లందు: భారతదేశ స్వాతంత్ర సమరయోధులు, నిరంకుశ నిజాం వ్యతిరేక తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖులైననిరంకుశ నిజాం వ్యతిరేక, తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖులైన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం ఇల్లందు మాజీ ఎమ్మెల్యే & బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ హరిప్రియ నాయక్ ఆదేశాల మేరకు ఇల్లందు నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి కార్యాలయం నందు, భారత రాష్ట్ర సమితి పార్టీ శ్రేణులతో కలిసి ఉద్యమకొండ, కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీని స్మరించుకుంటూ బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సిలివేరి సత్యనారాయణ, ఇల్లందు పట్టణ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వర్లు, ఇల్లందు మండలం మాజీ వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్ మాట్లాడుతూ.ఉద్యమకారుడు అనే పదానికి నిలువెత్తు నిర్వచనం కొండా లక్ష్మణ్ బాపూజీ అని, భారతదేశానికి స్వాతంత్రం వచ్చి దేశం అంతట ప్రజలు ఆనందోత్సవాలలో పాల్గొన్నప్పటికీ తెలంగాణ ప్రజలు నిత్యం నిజాం ఆకృత్యాలకు లోనై ఉండటాన్ని చూసి విమోచన ఉద్యమంలో పోరాడి హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ పై, పౌర హక్కులపై తీవ్ర నిర్బంధం కొనసాగుతున్న రోజుల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ అధ్యక్షుడిగా సిటిజన్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేసి ప్రజా చైతన్య కార్యక్రమాలు రూపొందించారని గుర్తు చేసుకున్నారు. తొలి ,మలి తరం తెలంగాణ ఉద్యమాల్లో ముందుండి నడిపించే తొలినాళ్లలో సమైక్యవాది అయినప్పటికీ ఆంధ్ర పాలకుల వివక్షణ స్వయంగా ఎదుర్కొని తన అభిప్రాయాలను మార్చుకొని 1969 నాటి తెలంగాణ విముక్తి ఉద్యమానికి నాయకత్వం వహించారని, 1996 నుండి మొదలైన మలిదశ ఉద్యమానికి కూడా అండగా నిలిచారని, 2001 ఏప్రిల్ 27న కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసం జలదృశ్యం లోనే టీఆర్ఎస్ పార్టీ పురుడు పోసుకుందని, జై తెలంగాణ నినాదం ఎత్తుకున్న వారందరికీ అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ఆ మహనీయుని సేవలను గుర్తు చేసుకుంటూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం మరియు తొలి ముఖ్యమంత్రివర్యులు శ్రీ కేసీఆర్ కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని అధికారికంగా ప్రకటించి ప్రతిఏటా ఘనంగా నిర్వహిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో 11వార్డు మాజీ కౌన్సిలర్ జెకె. శీను, ఇల్లందు మండల ఉపాధ్యక్షుడు దేరంగుల పోశం, సోషల్ మీడియా మరియు యువజన నాయకులు గిన్నారపు రాజేష్,సత్తాల హరికృష్ణ,కొండూ రవి కాంత్, ఇల్లందు పట్టణ నాయకులు బొడ్డుపల్లి సతీష్, మీరజాబేగ, బజారు సత్యనారాయణ, ఇల్లందు మండల పూదూరి లక్ష్మీనారాయణ, ఈశ్వర్, గైని శ్రీహరి, లోడుంగి రాహుల్, కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి...

**- కాంగ్రెస్ నాయకులకు మంత్రి సూచన...**



అందోలు, ప్రజాస్ఫూర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా సూచించారు. శనివారం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్ తో పాటు ఏయంసి మాజీ డైరెక్టర్ శేరి వెంకట్ రెడ్డి తో పాటు అందోలు మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ గెలుపుకు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ప్రతి పక్ష పార్టీలకు అవకాశం ఇవ్వకుండా గట్టిగా ప్రచారం చేయాలన్నారు. ఈ సందర్భంగా కన్ సాన్ పల్లి లో స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయమని వారు ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎంపీటిసి బాలయ్య, నాయకులు రమేష్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, నిఖిల్ రెడ్డి తో పాటు తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులపై వివక్షతను వీడాలి

**– బోనస్ 15 శాతం, కోల్ ఇండియా వేతనాలు చెల్లించాలి**

**– ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.సీతారామయ్య**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి యాజమాన్యం ఒకే కుటుంబం అంటూనే కాంట్రాక్టు కార్మికుల శ్రమను కాంట్రాక్టర్లకు దోచిపెడుతుందని, వివక్షతతో పేద కాంట్రాక్టు కార్మికుల కడుపులు కొడుతుందని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. సీతారామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ), సింగరేణి ఓబి ఆపరేటర్స్ అండ్ వర్కర్స్ యూనియన్, సింగరేణి సులబ్ వర్కర్స్ యూనియన్, మోటార్ వర్కర్స్ యూనియన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సింగరేణి కొత్తగూడెం ఏరియా జిఎం కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మి కులకు ప్రకటించిన బోనసు రూ.500లు అంటే రోజుకు రూ.1.30 పైసలని, ఇది సింగరేణి లాభాలలో సమాన వాటా పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులను అవమానపరచడమేనని ఆరోపించారు. తక్షణమే యాజమాన్యం పునరాలోచన చేసి సింగరేణి సాధించిన రూ.6930 కోట్ల లాభాల నుండి 15% బోనసు కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో ఓపెన్ కాస్టు,అండర్ గ్రౌండ్ గనులతోపాటు బొగ్గు ఉత్పత్తి, ఉత్పత్తి యేతర ప్రక్రియలో సుమారు 35 వేలమంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, పర్మనెంటు కార్మికులు చేసే అన్ని పనులలో ఉంటూ సంస్థ సాధించిన లాభాల్లో కాంట్రాక్టు కార్మికుల శ్రమ కీలకంగా ఉందని అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.500 బోనసుగా ఇస్తామని చేసిన ప్రకటన సంస్థలోని పనిచేసే అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులను తీవ్రంగా నిరాశపరిచిందని చెప్పారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు 2013 నుంచి హై పవర్ వేతనాలుచెల్లించాల్సి ఉన్నప్పటికీ చెల్లించకపోవడం వల్ల కాంట్రాక్టు కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. సింగరేణి యాజమాన్యం తక్షణమే స్పందించి సింగరేణిలో అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 15% బోనస్ చెల్లించాలని ఇందుకు యాజమాన్యం పునరాలోచన చేయాలని చేయాలని, కోల్ ఇండియాలో అమలుచేస్తున్న హై పవర్ కమిటీ వేతనాలను సింగరేణిలో అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాలని, సులబ్ కార్మికులకు హెచ్‌పీసీ వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను అమలు చేయించాలని, అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 26 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరంకు ఎస్ఓటు జీఎం కోటిరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్య దర్శి ఎన్.సంజీవ్, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు శరత్, సులబ్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు రాజేశ్వరి, ఉలికి బాబా, వెంకన్న, లక్ష్మి, అవినాష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక రిజర్వేషన్లు ఖరారు

*** చౌటుప్పల్ మండలంలో 12ఎంపీటీసీ, 25గ్రామపంచాయతీల స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు**

*** ఆర్డీవో శేఖర్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండల స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్లను చౌటుప్పల్ మండల కేంద్రం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అధికారులు ఖరారు చేశారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో వార్డుల నుంచి సర్పంచుల వరకు జనాభా ఆధారంగా రిజర్వేషన్లను నిర్ణయించారు. మహిళా రిజర్వేషన్లు డ్రా ద్వారా నిర్ణయించారు. చౌటుప్పల్ మండలంలోని వివిధ గ్రామాలలో ఎంపీటీసీల రిజర్వేషన్లను ఆర్డీవో శేఖర్ రెడ్డి ప్రకటించారు. దీనిలో భాగంగా డి నాగారం (ఎస్సీ జనరల్), చిన్న కొండూరు (ఎస్సీ మహిళ), ఆరెగూడెం బీసీ (జనరల్), పంతంగి బీసీ (జనరల్), దండు మల్కాపురం బీసీ (జనరల్), పెద్ద కొండూరు బిసి (మహిళా), తుప్రాన్ పెట్ (బిసి మహిళా), కోయలగూడెం (ఓసి జనరల్) నేలపట్ల (ఓసి జనరల్), పీపల్ పహాడ్ (ఓసీ జనరల్),జై కేసారం (ఓసి మహిళా), లింగోటం ఓసి (మహిళ ) గా రిజర్వేషన్ల ను ప్రకటించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల సర్పంచుల రిజర్వేషన్లను ఆర్డీవో ప్రకటిస్తూ అల్లాపురం (బీసీ జనరల్) , అంకిరెడ్డి గూడెం (జనరల్), ఆరెగూడెం (బిసి మహిళ), చిన్నకొండూరు (బిసి మహిళ) , చింతలగూడెం (జనరల్), డి నాగారం (బిసి మహిళ), దామెర (ఎస్సీ మహిళ ), ధర్మోజి గూడెం (ఎస్సీ జనరల్), ఎల్లంబాయి ( జనరల్ మహిళ), గుండ్లబావి (బిసి జనరల్), జై కేసారం (జనరల్ మహిళ), కైతాపురం (బిసి మహిళ), కాట్రేవు (ఎస్సీ మహిళ), కొయ్యలగూడెం (జనరల్ మహిళ ), మల్కాపురం (బిసి మహిళ ), మందోల్లగూడెం (బిసి జనరల్), మసీదు గూడెం (ఓసి జనరల్), నేలపట్ల (జనరల్ మహిళ) , పంతంగి (ఎస్సీ మహిళ), పెద్ద కొండూరు (బిసి మహిళ), పీపల్ పహాడ్ (బిసి జనరల్), ఎస్ లింగోటం( జనరల్), తూప్రాన్ పేట (జనరల్ మహిళ), ఎల్లగిరి (బీసీ మహిళ), ఎనగంటి తండా (ఎస్టీ జనరల్), రిజర్వేషన్లను ప్రకటించారు. అనంతరం గ్రామాలకు సంబంధించి వార్డుల రిజర్వేషన్లను చౌటుప్పల్ ఎంపీడీవో ప్రకటించారు. దీనికి ముందు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, చౌటుప్పల్ ఎంపీపీ (బీసీ మహిళ) గా, జడ్పిటిసి బీసీ (మహిళ)గా రిజర్వేషన్లను ప్రకటించారు.

## శ్రీ చైతన్య లో బతుకమ్మ సంబరాలు



యాదాద్రి భువనగిరి ప్రజాస్ఫూర్తి : బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా శనివారం రోజున శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో కళాశాల చైర్మన్ గడ్డం శ్రీనివాస్, కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్, సెక్రటరీ దరిపల్లి నవీన్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని బతుకమ్మలకు ధూప దీపాలను సమర్పించి కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చైర్మన్ గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ రోజు మన తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే గొప్ప పండుగ బతుకమ్మ గురించి మాట్లాడటం నాకు ఆనందంగా ఉంది అని అన్నారు. శ్రీ చైతన్య కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బతుకమ్మ అనేది స్త్రీల పండుగ. ఈ పండుగలో మన తల్లులు, అక్కాచెల్లెళ్ళు, అమ్మాయిలు పూలతో అందంగా బతుకమ్మను అలంకరించి ఆడిపాడుతూ భక్తి, ఆనందాలతో జరుపుకుంటారు. బతుకమ్మలో ఉపయోగించే పూలన్నీ ఆయుర్వేద గుణాలు కలిగినవే. ఇది ప్రకృతికి మనం ఇచ్చే కృతజ్ఞత, తల్లితనానికి ఇచ్చే గౌరవం అని అన్నారు. శ్రీ చైతన్య సెక్రటరీ దరిపల్లి నవీన్ కుమార్ మాట్లాడుతూ ఈ బతుకమ్మ పండుగలో గ్రామం, ఊరు, నగరం అన్న తేడా లేకుండా అందరూ కలిసి పాడుతూ, నృత్యం చేస్తూ సమాజంలో ఐక్యత, సోదరభావం పెంచుకుంటారు. బతుకమ్మలో స్త్రీ శక్తి, సాంప్రదాయం, సంస్కృతి, తెలంగాణ గౌరవం ప్రతిబింబిస్తాయి అని అన్నారు. శ్రీ చైతన్య ప్రిన్సిపల్ అంబోజు మల్లేష్ మన తల్లులు పాడే బతుకమ్మ పాటలు మన చరిత్ర, మన సంస్కృతిని తరతరాలకి అందజేస్తున్నాయి. అందుకే ఈ పండుగను తెలంగాణ రాష్ట్ర పండుగగా ప్రకటించారు. మనం అందరం కలిసి ఈ బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకొని, మన సంప్రదాయాన్ని కాపాడుకుందాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కొండల్ రెడ్డి, సంతోష్, మురళి, శైలేష్, పసల బాలరాజు, రఫీ,శ్రీకాంత్, దీపిక, హారికభవిత, అనూష, మమత, శ్రీలత ,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి ) : అమ్మవారి నవరాత్రుల సందర్భంగా జగద్గిరిగుట్టలో చిన్న , దేవేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి పూజలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జె కె శేఖర్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ లో ఉన్న ప్రజలందరూ సుఖసంతోషాలతోటి భోగభాగ్యాలతోటి అదేవిధంగా దీవినవరాత్రులు నీష్టగా జరుపుకోవాలన్నారు. దసరా పండుగను సంతోషంగా శాంతియుతంగా జరుపుకోవాలని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో జగన్ ముదిరాజ్ బస్తీ అధ్యక్షులు, కనకయ్య, వరలక్ష్మి ,యామిని గారు కావేరి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత అభివృద్ధి పై ప్రభుత్వం కట్టుబడి ఉంది

***భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి : పోచంపల్లి చేనేత సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేత అభివృద్ధి పై ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.. అధికారంలోకి వచ్చిన వెంటనే త్రిఫ్ట్ ఫండ్ కార్మాకులకు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంది అని అన్నారు. అనంతరం ఆచార్యా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులు అర్పించారు..

## సంధిల భాస్కర్ గౌడ్ గెలుపుతో రాజపేటలో సంబరాలు



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజాపేట మండల కేంద్రానికి చెందిన పాల సొసైటీ చైర్మన్ టిఆర్ఎస్ మండల పార్టీ సెక్రటరీ జనరల్ సంధిల భాస్కర్ గౌడ్ మదర్ డైరీ డైరెక్టర్ గా గెలుపొందడంతో శనివారం రాజపేటలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ ఫలితాలు అద్దం పడుతున్నాయన్నారు. రాజపేట పట్టణ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బెడిద వీరేశం, రాష్ట్ర మాజీ సర్పంచ్ ల ఫోరం ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, భాస్కర్, సురేష్,బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ లో రామ్ రాజ్ కాటన్ షోరూం ను ప్రారంభించిన పీఠాధిపతి నందగిరి స్వామి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం పోలీస్ స్టేషన్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన రామ్ రాజ్ కాటన్ షోరూంను వేద భారతి పీఠం పీఠాధిపతి నందగిరి స్వామి చేతుల మీదగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్ రాజ్ కాటన్ పరిశ్రమలు క్లాత్ పరిశ్రమల్లో ప్రత్యేకతను చాటుతున్నాయన్నారు. చౌటుప్పల్‌లో ప్రారంభమైన షోరూమ్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



## భారీ మెజారిటీతో మదర్ డైరీ డైరెక్టర్ గా భాస్కర్



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల కేంద్రానికి చెందిన బాల సొసైటీ చైర్మన్ సందిల భాస్కర్ గౌడ్ మదర్ డైరీ డైరెక్టర్ గా భారీ మెజార్టీతో గెలుపొందారు. శనివారం హయత్ నగర్ లోని మదర్ డైరీలో జరిగిన రెండు జనరల్ డైరెక్టర్, ఒక మహిళ రిజర్వేషన్ స్థానాల ఎన్నికల పోలింగ్ జరగగా, ముగ్గురిలో సంధిల భాస్కర్ గౌడ్ రికార్డ్ స్థాయిలో మెజార్టీ సాధించాడు. రెండు జనరల్ స్థానాలకు ఐదుగురు పోటీలో ఉండగా మొత్తం 308 మంది పాల చైర్మన్లు ఓట్లు వేయగా ఒక ఓటు తిరస్కరించబడగా 307 ఓట్లలో భాస్కర్ కు 240 ఓట్లు పోలయ్యాయి. దీంతో భాస్కర్ మదర్ డైరీ డైరెక్టర్గా గెలుపొందినట్లు ఎన్నికల అధికారి వెంకట్ రెడ్డి ప్రకటించారు. భాస్కర్ ఎన్నిక పట్ల అన్ని పార్టీల వారు అభినందించారు. డిసిసిబి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి ని భాస్కర్ కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా భాస్కర్ ను సత్కరించి అభినందించారు. సంధిలా భాస్కర్ గౌడ్ ఎన్నిక పట్ల రాజపేట మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ తోపాటు టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు, అభిమానులు బాల సొసైటీ డైరెక్టర్లు సభ్యులు భాస్కర్ ను అభినందించారు. రికార్డ్ స్థాయిలో 72 శాతానికి పైగా సందుల భాస్కర్ గౌడ్ కు ఓట్లు రాగా సందిలా భాస్కర్ గౌడ్ విషయంలో వార్ వన్ సైడు అయినట్లయినది. గొంగిడి సునీత మహేందర్ రెడ్డి దంపతుల ప్రభావం పార్టీ ప్రభావం, గత కొంతకాలంగా పాడి రైతుల కు జరుగుతున్న అన్యాయంపై సందిల భాస్కర్ గౌడ్ చేస్తున్న న్యాయపోరాటం ప్రభావం ఓట్ల రూపేనా స్పష్టంగా కనిపించింది.




## ఏకరూప దుస్తుల పంపిణీ

*** చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఉబ్బు వెంకటయ్య**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మార్కెట్ యార్డు కార్మికులకు చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఉబ్బు వెంకటయ్య శనివారం ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ మార్కెట్ యార్డులో హమాలీలు, దడవాయి, చాటవాలు కార్మికులు ఏకరూప దుస్తులు ధరించడంతో అందరూ సమానమని తెలియజేప్పినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఆకుల ఇంద్రసేనా రెడ్డి, డైరెక్టర్లు మహమ్మద్ గౌస్ ఖాన్, చిమ్మల వెంకట్ రెడ్డి, సుర్వి వెంకటేష్ గౌడ్, ప్రజా ప్రతినిధులు మార్కెట్ కమిటీ కార్యదర్శి రవీందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## దేవీ శరన్నవరాత్రుల అన్నదానంలో విద్యుత్ అంతరాయం – భక్తుల అవస్థలు



ప్రజాస్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరం ప్రాంతంలో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా జరిగిన అన్నదానంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది..శనివారం రామవరం రెండవ ఇంక్లైన్ ప్రాంతం సాల బస్తి అమ్మవారి నవరాత్రి వేడుకల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం ప్రారంభమైన వెంటనే రెండు సార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో క్యూ కట్టిన భక్తులు చీకట్లో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒకపక్క పండుగ ఉత్సాహం, మరోపక్క విద్యుత్ అంతరాయం కారణంగా భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు.

# ఆరోరోజు నవరాత్రి శోభ.. విశేష అలంకరణల్లో అమ్మవారు

**తెలుగు రాష్ట్రాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆరో రోజు అమ్మవారు వివిధ అలంకరణల్లో కొలువై భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆ చిత్రాలు..**































# ఎంఎంటీఎస్ రైళ్ల సంఖ్య పెంచాలి : ఎంపీ ఈటల డిమాండ్

* సమయపాలన లేకుంటే వీటి వల్ల ఏం ఉపయోగం
* జంట నగరాల్లోని రైల్వే సమస్యలు తీర్చండి
* ద.మ.రైల్వే జీఎంతో భేటీ అయిన ఎంపీ ఈటల



తెలంగాణ బ్యూరో: నగరంలో ఎంఎంటీఎస్ రైళ్లు వేళకు రాకుంటే ప్రయాణికులు ఎలా ఎక్కుతారని.. సకాలంలో వస్తే ప్రయాణికుల సంఖ్య పెరిగి ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఎంఎంటీఎస్ రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ కూడా పెంచాలన్నారు. శనివారం ఆయన సికింద్రాబాద్ రైల్ నిలయంలో ద.మ.రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో భేటీ అయ్యారు. నగరంలోని రైల్వే సమస్యలపై ఆయన జీఎంతో చర్చించారు. జంటనగరాల్లో రైల్వే సమస్యలు తీర్చి ప్రజారవాణా మరింత మెరుగయ్యేందుకు సహకరించాలని కోరారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో అనేక రైల్వే లైన్లు ఉండడం వల్ల ట్రాఫిక్ జాములతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు గత సంవత్సరంగా చేస్తున్న కృషి వల్ల 12 ఆర్ యూ బీ, ఆర్ఓబీల నిర్మాణానికి మార్గం సుగమం అయ్యిందని వచ్చే ఫిబ్రవరిలో కేంద్ర మంత్రిని తీసుకువచ్చి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయిస్తామన్నారు. ఫతే నగర్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి కూలిపోయి స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని.. దీనిపై ఆర్ అండ్ బీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలని కోరారు. సుచిత్ర, ఆనంద్ బాగ్ లో ఎంఎంటీఎస్ స్టాప్ లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాయలసీమ ఎక్స్ప్రెస్ ట్రైన్ బొల్లారం స్టేషన్ లో స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఉప్పల్ లో నిర్మించిన ఆర్వోబీ అక్టోబర్ 15 నుండి అందుబాటులోకి రానుందని రైల్వే అధికారులు ఎంపీకి తెలిపారు. మల్కాజ్గిరి, మేడ్చల్ రైల్వే స్టేషన్లో పునరుద్ధరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయని.. పనులు పూర్తిచేసి మరికొన్ని రైల్వే స్టేషన్లలోనూ సౌకర్యాలు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నామని ఈటల మీడియాకు తెలిపారు. హైదరాబాద్ లో ట్రాఫిక్ సమస్య వల్ల ప్రజలు అలసిపోతున్నారని.. రైల్వే పరంగా చేయాల్సిన పనులు చేసి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరినట్లు వెల్లడించారు.

## జిల్లా పరిషత్ రిజర్వేషన్లు ఖరారు.. జీవో విడుదల

స్థానిక ఎన్నికలపై పంచాయతీ రాజ్ శాఖ దూకుడు పెంచింది. తాజాగా రాష్ట్రంలో జడ్పీల రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఈ మేరకు శనివారం పంచాయతీ రాజ్ శాఖ జీవో జారీ చేసింది. కులగణన డేటా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించారు.




* **ఎస్టీ - ములుగు, వరంగల్, ఖమ్మం, నల్గొండ**
* **ఎస్సీ - హన్మకొండ, జనగామ, జోగులాంబ గద్వాల, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి**
* **బీసీ - సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్ నగర్, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, సూర్యాపేట, నాగర్ కర్నూల్, మంచిర్యాల, వికారాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి**
* **జనరల్ - పెద్దపల్లి, జగిత్యాల, నారాయణ పేట, కామారెడ్డి, మెదక్, ఆదిలాబాద్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం**

## సీఎం చొరవతో బతుకమ్మ చీరలు.. చేనేత రంగానికి అండగా ప్రజా ప్రభుత్వం: మంత్రి తుమ్మల



ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాట బాటలు వేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన సాగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. శనివారం రవీంద్ర భారతిలో ఆయన 110 జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రసంగిస్తూ ప్రజా సేవకే జీవితం అంకితం చేసిన గొప్ప పోరాట యోధుడు అని, బాపూజీ దేశ స్వాతంత్ర్య పోరాటంతో పాటు, తెలంగాణ సాయుధ పోరాటం లో కీలక పాత్ర పోషించారని తెలిపారు. రాష్ట్ర సాధనలో ప్రధాన భూమిక పోషించారని రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని త్యజించిన మహనీయుడని ఆయన కొనియాడారు. లక్ష్మణ్ బాపూజీ ఒక గొప్ప నాయకుడు. ఆయన తన జీవితాన్ని ప్రజల సేవకే అంకితం చేశారు. గాంధీజీ సిద్ధాంతాలను ఆచరించి, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని వెల్లడించారు. వారి ఆశయాలకు అనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన చేస్తున్నారని ముందు తరాలకు తెలిసేలా హార్టికల్చర్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టామని గుర్తు చేశారు. అదేవిధంగా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కూడా ఆయన పేరు పెట్టామని తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా చేనేత కార్మికుల రుణమాఫీ చేశామని చేనేత రంగాన్ని ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి చొరవతో బతుకమ్మ చీరలు వర్క్ ఆర్డర్‌తో చేనేత కార్మికులు నిలదొక్కుకునేలా ప్రజా ప్రభుత్వం చేనేత రంగానికి అండగా ఉందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కళాకారులు పాల్గొన్నారు.




## తెలంగాణ గ్రూపు2 అభ్యర్థులకు BIG అలర్ట్

ఫలితాల కోసం ఎదురుచూస్తున్న గ్రూపు 2 అభ్యర్థులకు ఎట్టకేలకు ఓ స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. ఆదివారం మధ్యాహ్నం ఫలితాలు విడుదల చేస్తారనే ప్రచారం జరుగుతోంది. దీనిపై కాసేపట్లో అధికారిక ప్రకటన వెలువడనుందని సమాచారం. కాగా, దసరా పండగలోపు తుది ఫలితాలను వెల్లడించడంతోపాటు నియామకపత్రాలు అందించాలని TGPSC భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గ్రూప్2లో 783 పోస్టుల భర్తీకి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసింది. యూనిఫాం పోస్టులకు అర్హులైనవారి వైద్య నివేదికలూ అందాయి. అభ్యర్థుల విద్యార్హతలు, ఆప్షన్లు, మెరిట్, రిజర్వేషన్లు తదితర విషయాలు పరిగణనలోకి తీసుకుని తుది జాబితాను రూపొందించినట్లు సమాచారం. టీజీపీఎస్సీ 783 పోస్టులతో 2022లో గ్రూప్2 నోటిఫికేషన్ జారీచేసింది. 2024 డిసెంబరులో రాత పరీక్ష నిర్వహించి... ఈ ఏడాది మార్చి 11న జనరల్ ర్యాంకుల జాబితాను వెల్లడించింది. ఎట్టకేలకు రేపు ఫలితాలు విడుదల అవుతాయని తెలుస్తోంది.

## డెక్కన్ పీఠభూమి పర్యాటకులకు నిజమైన స్వర్గసీమ

**: డిప్యూటీ సీఎం భట్టి**



హైదరాబాద్ శిల్పారామంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టూరిజం కాంక్లేవ్‌లో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ఓ వైపు కృష్ణ, మరో వైపు గోదావరి జీవనదుల మధ్య విస్తరించిన డెక్కన్ పీఠభూమి పర్యాటకులకు నిజమైన స్వర్గసీమ అని పేర్కొన్నారు. గలగల పారే నదులు, పచ్చని అరణ్యాలు, ప్రకృతి అందాలు, చారిత్రక వారసత్వం, ఆధునిక హైదరాబాదుతో పాటు, తెలంగాణ పర్యాటక రంగం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుందని తెలిపారు. గత పదేళ్ల పాటు రాష్ట్ర పర్యాటక శక్తిని ప్రపంచ పటంలో నిలబెట్టడంలో నిర్లక్ష్యం జరిగిందని, కానీ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రస్తుత ప్రభుత్వం "Telangana Rising" నినాదంతో పర్యాటక రంగాన్ని ముందుకు తీసుకువెళ్తోందని అన్నారు. పర్యాటక రంగంలో ఇప్పటికే రూ.50 వేల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించబడుతున్నాయి అని పేర్కొంటూ, వెల్‌నెస్ సెంటర్లు, హాస్పిటల్ టూరిజం, ఎకో టూరిజం, సినీ పరిశ్రమ, సాఫ్ట్‌వేర్ రంగం, సాంస్కృతిక సంపద అన్ని కలిసి తెలంగాణను ప్రపంచ పర్యాటకుల గమ్యస్థానంగా నిలబెడతాయని వివరించారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్న వేళ, అభినందించాల్సిన వారు కొందరు ఆందోళన చెందుతున్నారని వ్యాఖ్యానించారు. వాతావరణం, భాష, శాంతి భద్రతలు, మానవ వనరుల వంటి అనేక అంశాల్లో తెలంగాణ ప్రత్యేకతను ప్రదర్శిస్తోందని తెలిపారు. పెట్టుబడిదారుల సంక్షేమం, రాష్ట్రానికి వచ్చే పర్యాటకుల భద్రత రెండింటినీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా చూస్తోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## డీజీపీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. డీజీపీ కార్యాలయంలోని మహిళా సిబ్బంది, మహిళా పోలీస్ అధికారులు ఉత్సాహంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకలను డీజీపీ డాక్టర్ జితేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా మహిళ సిబ్బందితో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ మహేష్ఎం భగవత్, పర్సనల్ అడిషనల్ డీజీపీ అనిల్ కుమార్, పి అండ్ ఎల్ ఐజిపి ఎం. రమేశ్ , అడ్మిన్ ఏఐజి నాగరాజు, డిజిపి కార్యాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



## మంత్రి శ్రీధర్‌బాబు మెట్రో జర్నీ.. ప్రయాణికులతో ముచ్చట

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శనివారం మెట్రో జర్నీ చేశారు. సాధారణ ప్రయాణికుడిలా టికెట్ కొనుగోలు చేసి.. తూర్పున ఉన్న నాగోల్ స్టేషన్ నుండి పశ్చిమాన ఉన్న ఐటీ కారిడార్ రాయదుర్గం వరకు ప్రయాణించారు. మెట్రో సేవలు, సౌకర్యాలు, స్టేషన్లలో భద్రత, రవాణా సవాళ్లు, ట్రాఫిక్ తదితర అంశాలపై ప్రయాణికులతో ముచ్చటించారు. మెట్రో అనుభవాలను స్వయంగా తెలుసుకునేందుకు మెట్రో రైలులో ఆకస్మికంగా ప్రయాణించారు. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన రవాణాను అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి ప్రయాణికులకు వివరించారు. నగరంలో ప్రజారవాణా బలోపేతానికి ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలు, మెట్రో ఫేజ్ 2 విస్తరణ, ఆర్ఆర్ఆర్, ఇతర భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. సలహాలు, సూచనలు స్వీకరించారు. ఇది ప్రజా ప్రభుత్వమని.. ప్రశంసలను తీసుకుంటున్నట్లుగానే విమర్శలనూ స్వీకరిస్తామని చెప్పారు. భవిష్యత్తు తరాల కోసం పనిచేస్తున్న ఈ ప్రభుత్వానికి అండగా నిలవాలని, రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. కాగా.. మెట్రోను ప్రభుత్వం అధీనంలోకి తీసుకున్న మూడు రోజుల్లోనే మంత్రి మెట్రో జర్నీ చేయడం ఆసక్తికరంగా మారింది.



## స్థానిక ఎన్నికల్ని వాయిదా వేయండి: తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

బీసీ రిజర్వేషన్ల పెంపుపై చట్ట ప్రకారమే ప్రభుత్వం ముందుకెళ్లాలని హైకోర్టు ఆదేశించింది. గవర్నర్ దగ్గర బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు జీవో ఇవ్వడం సరికాదని వ్యాఖ్యానించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం అంటూ రెడ్డి జాగృతి మాధవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అభినందన్, జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి ధర్మాసనం శనివారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపున సీనియర్ లాయర్లు చిక్కుడు ప్రభాకర్, మయూర్ రెడ్డి వాదనలు వినిపించగా ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్ రెడ్డి ఆన్ లైన్‌లో వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు జీవో ఇవ్వడం సరికాదని, అవసరమైతే స్థానిక ఎన్నికలు వాయిదా వేసుకోండి అని వ్యాఖ్యానించింది. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చినా మెరిట్ ఆధారంగా విచారిస్తామని స్పష్టం చేసింది. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వం తరపు నిర్ణయం చెప్పాలని ఏజీని ఆదేశిస్తూ తదుపరి విచారణ అక్టోబర్ 8కి వాయిదా వేసింది.



## ఉలికి పని చెప్పలేదు.. శిల్పులు చెమటోడ్చలేదు..

హైదరాబాద్: దసరా నేపథ్యంలో హైదరాబాద్‌లోని లోతుకుంటలో ఐరన్ ఫ్రేమ్‌ల మీద ఫైబర్ మౌల్డ్స్‌తో ఈ నమూనా ఆలయాన్ని తీర్చిదిద్దుతున్నారు. బెంగాల్ సంప్రదాయంలో దుర్గాదేవికి పూజలు చేయడానికి కృష్ణశిలలతో నిర్మించిన ఆలయాన్ని మైమరిపించేలా ఆకర్షణీయంగా రూపొందిస్తున్నారు. గాలిగోపురం, దానిపైన దేవతలు, యక్షుల బొమ్మలతో పాటు ప్రధాన ద్వారం వద్ద గరుత్మంతుడు, హనుమంతుడు విగ్రహాలను నెలకొల్పారు. ఇక్కడ శనివారం నుంచి నవరాత్రుల తొమ్మిదో రోజు వరకూ పూజలు నిర్వహించనున్నారు.

# చొరబాటుకు సిద్ధంగా.. సరిహద్దుల్లో ఉగ్రవాదులు: బీఎస్ఎఫ్ ఐజీ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో అంతర్జాతీయ సరిహద్దును దాటుకొని దేశంలోకి చొరబడేందుకు ఉగ్రమూకలు చేసే ప్రయత్నాలను భారత సైన్యం ఎప్పటికప్పుడు తిప్పికొడుతూనే ఉంది. అయినప్పటికీ దేశానికి ఉగ్రముప్పు పొంచి ఉంటుంది. తాజాగా నియంత్రణ రేఖ వెంబడి లాంచ్ ప్యాడ్ల వద్ద ఉగ్రవాదులు కాపు కాస్తున్నాయని బీఎస్ఎఫ్ ఐజీ అశోక్ యాదవ్ తెలిపారు. కశ్మీర్ లోయలోకి చొరబడేందుకు ఉగ్రమూకలు నియంత్రణ రేఖ వెంబడి కాపు కాస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందిందన్నారు. ఉగ్రవాదులను ఎదుర్కొనేందుకు భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని, చొరబాటుయత్నాలను భగ్నం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శీతాకాలం ప్రారంభానికి ముందు ఉగ్రముఠాలు కశ్మీర్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తుంటారని బీఎస్ఎఫ్ ఐజీ అశోక్‌యాదవ్ తెలిపారు. బాందిపోరా, కుప్వారా సెక్టార్లలోని ఎల్ఓసీ మీదుగా ఉన్న లాంచ్ ప్యాడ్‌లలో ఉగ్రవాదుల ఉనికి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఉగ్రవాదులు కశ్మీర్‌లోకి చొరబడడానికి తగిన సమయం కోసం వేచి చూస్తున్నారని.. అయితే, వారి చొరబాటు యత్నాన్ని భగ్నం చేయడానికి జమ్మూకశ్మీర్‌లో బీఎస్ఎఫ్, సైన్యం అలర్ట్‌గా ఉందన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఇటీవల కొన్నేళ్లలో ఉగ్రవాదుల చొరబాటు ఘటనలు తగ్గుముఖం పట్టినప్పటికీ..



అడపాదడపా పర్వత ప్రాంతాలు, అడవుల గుండా ముష్కరులు సరిహద్దును దాటేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. వారిని బీఎస్ఎఫ్ దళాలు ఎప్పటికప్పుడు అడ్డుకుంటూనే ఉన్నాయి.

# ఉమ్మితో పేజీలు తిప్పడమేంటీ..?

## హైకోర్టు ఆగ్రహం

ఫైళ్ల నిర్వహణకు సంబంధించి సిబ్బంది తీరుపై అలహాబాద్ హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దస్త్రాలపై లాలాజలం మరకలు ఉండటాన్ని తీవ్రంగా పరిగణించింది. ఉమ్మిని ఉపయోగించడం అసహ్యకరమని మండిపడింది. ఇటువంటి అపరిశుభ్ర చేష్టలతో వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుందని పేర్కొంటూ సిబ్బందిని తీవ్రంగా మందలించింది. ఓ కేసుకు సంబంధించి ఇటీవల విచారణ చేపట్టిన అలహాబాద్ హైకోర్టులోని లఖ్‌నవూ బెంచ్.. కొన్ని ఫైళ్లపై ఎరుపు రంగు మరకలు ఉండటాన్ని గుర్తించింది. తరచూ ఇటువంటివి కనిపిస్తుండటాన్ని ప్రస్తావించిన న్యాయమూర్తి.. ఉమ్మితో పేజీలను తిప్పడం వల్లే అవి ఏర్పడినట్లు అనుమానించారు. పాన్ మసాలా తిన్న వారి వల్లే ఫైళ్లపై ఎరుపు రంగు మరకలు పడ్డాయనే అభిప్రాయానికి వచ్చారు. ఇటువంటి ఫైళ్లను అనుమతించవద్దని రిజిస్ట్రీని ఆదేశించారు. ''ఇది అత్యంత అపరిశుభ్రమైన వ్యవహారం. ఇటువంటి అసహ్యకరమైన,



ఖండించదగినవే కాదు.. పౌరస్పృహ లేనిది. ఇలాంటి మురికి పనులను నిలువరించకపోతే వీటిని ముట్టుకునే వారు ఇన్‌ఫెక్షన్ల బారినపడే ప్రమాదం ఉంటుంది'' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. పిటిషన్లు, దరఖాస్తులు, పుస్తకాలను తీసుకునేటప్పుడు వాటిని పరిశీలించాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ.. లాలాజలం మరకలు ఉన్నవాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించకూడదని స్పష్టం చేశారు.

# విజయ్ రాక ఆలస్యం, అంచనాలకు మించిన రద్దీ..

నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచారసభ తీవ్ర విషాదాన్ని నింపింది. రోడ్ షోలో జరిగిన తొక్కిసలాటలో దాదాపు 30 మందికిపైగా మృతి చెందడం కలచివేస్తోంది. అయితే, ఈ ఘటనకు అంచనాలకంటే భారీ సంఖ్యలో అభిమానులు హాజరుకావడం సహా పలు కారణాలుగా భావిస్తున్నారు.



- రోడ్‌షో కోసం కేవలం 10 వేల మంది వస్తారని అంచనా వేసిన టీవీకే పార్టీ .. అందుకు సంబంధించి పోలీసుల నుంచి అనుమతి పొందింది.
- లైట్‌హౌస్ రౌండ్‌టానా సమీపంలో ఇంజినీర్‌తో అధ్యయనం చేశామని, అక్కడున్న 1.2లక్షల చ.అడుగుల విస్తీర్ణం 60వేల మందికి సరిపోతుందని తెలిపింది. అయితే, తమ రోడ్ షోకు మాత్రం 10 వేల మంది వస్తారని అంచనా వేస్తున్నట్లు అందులో పేర్కొంది.
- షెడ్యూల్ ప్రకారం శనివారం మధ్యాహ్నం సమయంలోనే విజయ్ అక్కడకు రావాల్సి ఉంది. కానీ, ఆరు గంటల ఆలస్యంగా కరూర్‌కు చేరుకున్నారు.
- విజయ్ అక్కడికి చేరుకునే సమయానికే అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో గుమికూడారు. రద్దీతోపాటు ఉక్కపోత కారణంగా అనేక మంది స్పృహ తప్పిపోయినట్లు తెలుస్తోంది.
- పరిస్థితి గమనించిన విజయ్.. వారికి తన వాహనంలో ఉన్న నీళ్ల బాటిళ్లను అందించే ప్రయత్నం చేశారు. మరోవైపు కార్యకర్తలు, అభిమానులు విజయ్ వాహనం దగ్గరికి వచ్చే ప్రయత్నం చేదయంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో కార్యకర్తలు సహా చిన్నారులు కూడా ప్రాణాలు కోల్పోయారు.

# వాంగ్‌చుక్‌కు పాకిస్థాన్‌తో సంబంధాలపై దర్యాప్తు: లద్దాఖ్ డీజీపీ

లద్దాఖ్ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్‌కు పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నట్లు డీజీపీ ఎస్‌డీ సింగ్ జామ్వాల్ వెల్లడించారు. లేహ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వాంగ్‌చుక్‌తో సంబంధాలు కలిగి ఉన్నట్లు అనుమానిస్తున్న ఓ పాకిస్థానీ గూఢచారిని ఇటీవల అరెస్టు చేసినట్లు చెప్పారు. సోనమ్ నిరసనల వీడియోలను ఆ వ్యక్తి పాకిస్థాన్‌కు పంపినట్లు తెలిపారు. ''లద్దాఖ్‌లో చెలరేగిన హింస వెనుక వాంగ్‌చుక్ కీలక వ్యక్తి. ఆయన రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకలో చోటుచేసుకున్న నిరసనలను ప్రస్తావించారు. ఆయన నేతృత్వంలో జరిగిన నిరసనల వీడియోలను పొరుగు దేశానికి రిపోర్ట్ చేస్తున్న ఓ పీఐవోను ఇటీవల అరెస్టు చేశాం. అదేవిధంగా వాంగ్‌చుక్ విదేశీ పర్యటనల్లో కొన్ని అనుమానాస్పదంగా ఉన్నాయి. పాకిస్థాన్‌లో 'ది డాన్' నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. బంగ్లాదేశ్‌నూ సందర్శించారు. వాంగ్‌చుక్ స్వచ్ఛంద సంస్థకు



విదేశీ నిధులపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోంది. కేంద్రం, లద్దాఖ్ ప్రతినిధుల మధ్య చర్చలను అడ్డుకునేందుకు ఆయన యత్నించారు. ఈ నెల 25న ఇరుపక్షాల మధ్య సమావేశం ఉందని తెలిసీ.. తన నిరాహార దీక్షను కొనసాగించారు. సమావేశానికి ఒక రోజు ముందు రెచ్చగొట్టే వీడియోలు, ప్రకటనలు చేశారు. శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు ఉద్దేశపూర్వకంగా యత్నించారు. ఇది హింసకు, మరణాలకు దారితీసింది'' అని డీజీపీ జామ్వాల్ తెలిపారు. లద్దాఖ్ హింసలో విదేశీ కుట్ర జరిగిందంటూ లెఫ్టినెంట్ గవర్నర్ కవీందర్ గుప్తా చేసిన ఆరోపణలపై డీజీపీ స్పందించారు. ఇటీవలి ఘటనల అనంతరం ముగ్గురు నేపాల్ పౌరులు బుల్లెట్ గాయాలతో ఆసుపత్రిలో చేరారని, మరికొందరి ప్రమేయం కూడా వెలుగులోకి వచ్చిందన్నారు. మొత్తం 50 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిలో దాదాపు 10-12 మందిని ప్రధాన నిందితులుగా అనుమానిస్తున్నట్టు చెప్పారు. లద్దాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని, ఆ ప్రాంతాన్ని ఆరో షెడ్యూలు పరిధిలో చేర్చాలని కోరడంతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం సాగుతున్న ఉద్యమం ఇటీవల హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. నలుగురు మృతిచెందగా.. 90 మంది గాయపడ్డారు. ఈ క్రమంలోనే వాంగ్‌చుక్‌ను శుక్రవారం జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద అరెస్టు చేసి వేరే ప్రాంతానికి తరలించారు. ఆయన అరెస్టును కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ సహా ప్రతిపక్షాలన్నీ ఖండించాయి.

# అప్పులు.. ఆర్భాటాలకు దూరం..

## వందలాది గ్రామాల్లో సాధారణ జీవన మంత్రం!




లుధియానా: వివాహ వేడుకలు, ఇతరత్రా కార్యక్రమాల్లో అనవసర ఖర్చులు, హంగులు, ఆర్భాటాలకు వెళ్లి చాలామంది అప్పుల పాలవుతుంటారు! పంజాబ్‌కు చెందిన రైల్వే విశ్రాంత ఉద్యోగి ఉర్విందర్ సింగ్ ఇలాంటి ఓ వ్యవహారాన్నే దగ్గరి నుంచి గమనించారు. తన ఇంట్లో పనిచేసే మహిళ.. ఓ కార్యక్రమం కోసం రూ.50 వేలు అప్పు చేయడం చూశారు. సామాజిక ఒత్తిడితో పేద కుటుంబాలు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్న తీరు చూసి దిగ్భ్రాంతి చెందిన ఆయన.. దీనికి పరిష్కారంగా 2017లో ఓ సొసైటీ స్థాపించారు. సాధారణ జీవన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించడం ప్రారంభించారు. ఈ సొసైటీ దాదాపు 250 గ్రామాల్లో పోస్టర్ల ద్వారా తన సందేశాన్ని ప్రచారం చేస్తోంది. ఈ క్రమంలోనే అహ్మద్‌గఢ్ గ్రామం తొలుత ముందుకొచ్చింది. స్థానికంగా ఆడంబర వివాహాలను నిషేధిస్తూ తీర్మానం చేసింది. ఈ సందేశం క్రమక్రమంగా ఇతర గ్రామాలకూ విస్తరించింది. గత ఎనిమిదేళ్లలో దాదాపు 100 గ్రామాలు వివాహాది కార్యక్రమాలను సాధారణంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాయి. మరోవైపు.. అమర్‌జిత్ కౌర్ అనే వ్యక్తి 'టేక్ హోమ్ హ్యాపీనెస్' ప్రచారం నిర్వహిస్తున్నారు. అప్పులు లేని, ప్రశాంతమైన జీవనం కోసం ఆయా వేడుకలను సాధారణంగా చేసుకోవడాన్ని, సిక్కు బోధనల ప్రకారం జీవించడాన్ని ప్రోత్సహిస్తున్నారు.

# స్కూల్‌కు ప్రవేశ పరీక్ష.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన 11ఏళ్ల విద్యార్థి

స్కూళ్లలో అడ్మిషన్ పొందడానికి ప్రవేశపరీక్ష నిర్వహిస్తుండడంపై ఓ 11 ఏళ్ల విద్యార్థి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ విధానాన్ని ప్రశ్నిస్తూ.. న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. దిల్లీలో సీఎం శ్రీ స్కూళ్లలో అధికారులు 6,7,8 తరగతుల్లో ప్రవేశాలకు కూడా ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ.. ప్రభుత్వ సర్వోదయ బాల్ విద్యాలయంలో 6వ తరగతి చదువుతున్న జన్మేశ్ సాగర్ అనే విద్యార్థి సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ చర్యలు ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం (2009) నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నాడు. 2025-26 విద్యా సంవత్సరానికి తాను సీఎం శ్రీ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నట్లు జన్మేశ్ సాగర్ పిటిషన్‌లో తెలిపాడు. జులై 23, 2025న జారీ చేసిన ప్రభుత్వ సర్క్యులర్ ప్రకారం.. సెప్టెంబర్ 13, 2025న ప్రవేశపరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నాడు. ఇటువంటి ప్రత్యేక కేటగిరీ ఉన్న పాఠశాలల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించడం చట్టవిరుద్ధమని పిటిషన్‌లో తెలియజేశాడు. ఇందుకుగాను జులై 23 నాటి సర్క్యులర్‌ను రద్దు చేసి.. ప్రవేశపరీక్షల ద్వారా కాకుండా లాటరీ వ్యవస్థ ద్వారా విద్యార్థులకు అడ్మిషన్లు నిర్వహించేలా.. పాఠశాల యాజమాన్యాన్ని



ఆదేశించాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరాడు.

# నేనేం వారాంతపు రాజకీయ నాయకుడిని కాదు : విజయ్‌పై ఉదయనిధి స్టాలిన్ విమర్శలు

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమిళ నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ ప్రతి శనివారం ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ విజయ్‌పై పరోక్ష విమర్శలు చేశారు. రాజకీయ నాయకుడిగా తన కార్యక్రమాలను వారంలో ఒక రోజుకు మాత్రమే పరిమితం చేయడానికి తానేమీ ఇతర నేతల్లా వారాంతపు రాజకీయ నాయకుడిని కాదన్నారు. ''నేను శనివారాల్లో మాత్రమే బయటకు వచ్చే నాయకుడిని కాదు. ఆదివారాల్లో కూడా నేను ప్రయాణిస్తూనే ఉంటాను. అంతెందుకు ఈ రోజు ఏ రోజు అనేది కూడా నాకు తెలియదు'' అని ఉదయనిధి పేర్కొన్నారు. తమిళనాడు భాజపా మాజీ అధ్యక్షుడు అన్నామలై సైతం విజయ్ ప్రచారశైలిని తప్పుబట్టారు. విజయ్ తెర వెనక నిలబడి మాట్లాడుతున్నారని.. ముందుగా ఆయన బయటకు రావాలన్నారు. రాజకీయ నాయకుడంటే వారాంతాల్లో మాత్రమే కాకుండా 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కానీ అందుకు విరుద్ధంగా విజయ్ కేవలం శని, ఆదివారాల్లోనే ప్రజలకు అందుబాటులోకి వస్తారన్నారు. తాము ఏడాది పొడవునా ప్రజల్లోనే ఉంటామన్నారు. కాబట్టి ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి తగిన నిర్ణయం



తీసుకోవాలని సూచించారు. టీవీకే నిజమైన రాజకీయ పార్టీగా ఉండాలనుకుంటే ఆ పార్టీ అధినేత, ఇతర నేతలు తమ వైఖరిని మార్చుకోక తప్పదన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకే శనివారాల్లో ప్రచారాలు నిర్వహించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తమిళగ వెట్రి కళగం పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలాఉంటే.. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్నాయి. టీవీకేతో సహా ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటినుంచే కసరత్తు చేస్తున్నాయి. రాష్ట్రంలో విజయ్ అధికార డీఎంకేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. భాజపా పైనా విమర్శనాస్త్రాలను సంధిస్తున్నారు.

# రాజ్ కుంద్రా వద్ద రూ.150 కోట్ల విలువైన బిట్‌కాయిన్‌లు

## ఛార్జ్‌షీట్‌లో ఈడీ

బాలీవుడ్ నటి శిల్పాశెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రా న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటున్నారు. బిట్‌కాయిన్‌కు సంబంధించిన మనీలాండరింగ్ వ్యవహారంలో తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఛార్జిషీట్ దాఖలు చేసింది. అందులో రాజ్‌కుంద్రా పేరును చేర్చింది. ఆయన వద్ద రూ.150 కోట్ల విలువైన 285 బిట్‌కాయిన్లు ఉన్నాయని పేర్కొంది. క్రిప్టో కుంభకోణం సూత్రధారి అమిత్ భరద్వాజ్ నుంచి కుంద్రాకు ఈ బిట్‌కాయిన్లు బదిలీ అయ్యాయని ఈడీ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఉద్దేశపూర్వకంగానే



ఈ లావాదేవీలను, బిట్‌కాయిన్ వ్యాలెట్ అడ్రస్‌లను దాచిపెట్టారని ఆరోపించింది. ప్రస్తుతం అవి అతడి అధీనంలోనే ఉన్నాయని, వాటినుంచి లబ్ధి పొందుతున్నారని పేర్కొంది. ఆదాయ వనరుల వివరాలు దాచిపెట్టేందుకు భార్య శిల్పాశెట్టితో ఆర్థిక ఒప్పందం కుదుర్చుకున్నారని ఛార్జిషీట్‌లో ప్రస్తావించింది. ఇప్పటికే ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేసిన కేసులో నటి శిల్పాశెట్టి దంపతులు ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసులో కొన్ని రోజుల క్రితం కుంద్రాను ముంబయి పోలీసులు విచారించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో శిల్పాశెట్టి దంపతులకు ముంబయి పోలీసులు లుకౌట్ నోటీసులు కూడా జారీ చేశారు.

# ఆ కార్లను బయటే పార్కింగ్ చేయండి అమెరికన్లకు సూచన

ప్రముఖ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ కార్లకు సంబంధించి అమెరికన్ యజమానులకు అక్కడి జాతీయ రహదారుల ట్రాఫిక్ భద్రతా విభాగం కీలక సూచన చేసింది. కార్లను గ్యారేజీల్లో పార్కింగ్ చేయొద్దని, వాటిని నివాసాల బయట లేదా దూరంగా పార్కింగ్ చేసుకోవాలని దాదాపు 2లక్షల మంది యజమానులకు సూచించింది. స్టార్టర్‌లో సమస్య కారణంగా షార్ట్ సర్క్యూట్ వచ్చి మంటలు చెలరేగే ప్రమాదం ఉందన్న నేపథ్యంలో తాజా అలర్ట్ జారీ చేసింది. అమెరికాలో 201922 మధ్య కాలంలో తయారైన కొన్ని వాహనాల ఇంజిన్‌లో స్టార్టర్ రిలే తుప్పు పట్టి విపరీతంగా వేడెక్కే అవకాశం ఉందని, తద్వారా షార్ట్ సర్క్యూట్‌కు కారణమయ్యే ప్రమాదం ఉందని బీఎండబ్ల్యూ గుర్తించింది.



## శరవేగంగా లెనిన్ చిత్రీకరణ

### శ్రీలీల ప్లేస్‌లో భాగ్యశ్రీ బోర్సే

టాకీస్: అఖిల్ అక్కినేని హీరోగా వస్తున్న చిత్రం లెనిన్. వినరో భాగ్యం విష్ణు కదా ఫేమ్ మురలీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్ పై నాగవంశీ నిర్మిస్తున్నారు. ఆ మధ్య రిలీజ్ లెనిన్ గ్లిమ్స్ సినిమాపై ఆడియెన్స్ లో క్యూరియాసిటిని పెంచింది. అలాగే ఈ సినిమాలో హీరోయిన్ గా మొదట శ్రీలీలను తీసుకున్నారు మేకర్స్. కొంత పోర్షన్ షూటింగ్ కూడా చేసారు. కానీ బాలీవుడ్ సినిమా కోసం లెనిన్ కు డేట్స్ ఇవ్వడంలో డిలే చేస్తుండడంతో ఆమెను ఈ సినిమా నుండి తప్పించి ఆ పోర్షన్ ను రీ షూట్ చేసారు మేకర్స్. శ్రీలీలతో కేవలం ఎనిమిది రోజుల షూట్ మాత్రమే చేసారు. ఆమె ప్లేస్ లో భాగ్యశ్రీ బోర్స్ ని అఖిల్ సరసన హీరోయిన్ గా తీసుకున్నారు. భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న ఈ యాక్షన్ డ్రామా ఇప్పటికే 80శాతం షూటింగ్ పూర్తయింది, చివరి షెడ్యూల్ ఈ నెలలో ప్రారంభమవుతుంది. క్లైమాక్స్ సన్నివేశాలతో పాటు ప్యాచ్ వర్క్ ను అక్టోబర్ నాటికి ఫినిష్ చేసేలా షెడ్యూల్ ప్లాన్ చేసారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఏడాది రిలీజ్ చేయాలని భావిస్తున్నారు. వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఈ ఏడాది నవంబరు 17న లెనిన్ ను రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. అందుకు అనుగుణంగానే షూటింగ్ ను జెట్ స్పీడ్ లో చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమాతో ఎలాగైనా హిట్ కొట్టాలని అఖిల్ పట్టుదలగా ఉన్నాడు.



## ది ప్యారడైజ్ మూవీలో మోహన్‌బాబు



టాకీస్: కథానాయకుడు నాని - దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మరోసారి ది ప్యారడైజ్ మూవీలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. 'ది ప్యారడైజ్' అంటూ విభిన్న కథతో రానున్నారు. ఈ సినిమాలో అగ్ర నటుడు మోహన్ బాబు ఉన్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన లుక్‌ను రిలీజ్ చేశారు. ఇందులో మోహన్‌బాబు 'శికంజ మాలిక్'గా కనిపించనున్నట్లు తెలుపుతూ పోస్టర్ విడుదల చేశారు. షర్ట్ లేకుండా గన్, కత్తి పట్టుకుని సిగార్ కాలుస్తూ రగ్గడ్ లుక్‌లో మోహన్‌బాబు కనిపిస్తున్నారు. ఆయన పవర్‌ఫుల్ విలన్‌గా నటిస్తున్నట్లు- చిత్రబృందం తెలిపింది. ఇక ఇందులో నాని కూడా ఇప్పటివరకూ చూడని డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్న విషయం తెలిసిందే. నాని 'జడల్' పాత్రలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది మార్చి 26న ఈ సినిమా ప్రేక్షకులను పలకరించనుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీతోపాటు-... మొత్తం 8 భాషల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. తిరుగుబాటు-, నాయకత్వంతో పాటు- తల్లీకొడుకుల అనుబంధం కథకు కీలకంగా నిలవనున్నట్లు- ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతుంది.

## ఈ అవకాశం కలలో కూడా ఊహించలేదు

### కాంతారా చాప్టర్-1 నటి రుక్మిణీ వసంత్

టాకీస్: 'కాంతార చాప్టర్ 1'లో నటించే అవకాశం వస్తుందని నేను కలలో కూడా ఊహించలేదని నటి రుక్మిణీ వసంత్ అన్నారు. 'కాంతార చాప్టర్ 1'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటి రుక్మిణి వసంత్. రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం అక్టోబర్ 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. నేను నటించిన 'సప్తసాగరాలు దాటి', 'ఏస్' చిత్రాలను రిషబ్ శెట్టి చూశారు. వాటి ప్రీమియర్స్‌కు వచ్చి నా నటనను మెచ్చుకున్నారు. ఇదంతా ఆయన నా ప్రీమియర్స్ చూసి ఇందులో ఛాన్స్ ఇచ్చారని నేను భావిస్తున్నా. కాంతార టీ-మ్ నాకు ఫోన్ చేసి ఇందులో భాగం అవుతారా అని అడిగినప్పుడు నా ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను. ఈ సినిమా 4,5 శతాబ్దాల మధ్య జరిగే కథ. అప్పటి పరిస్థితులకు తగినట్లు- వాటిని అర్థం చేసుకుంటూ నటించాలి. అలాగే దీనికోసం గుర్రపు స్వారీ, కత్తి యుద్ధంలలో శిక్షణ పొందడం ఎంతో సరదాగా అనిపించింది. కొన్ని యాక్షన్ సన్నివేశాలు చేశానని రుక్మిణి తెలిపారు. కొన్ని సందర్భాల్లో రిషబ్ శెట్టిని చూసి ఆశ్చర్యపోయినట్లు- తెలిపారు. నటు-డిగా, దర్శకుడిగా ఆయన ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలిస్తారని ప్రశంసలు కురిపించారు. ఇక తాను ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కాంబోలో రానున్న సినిమా, యశ్ టాక్సిక్ గురించి ఇప్పడే ఏం చెప్పలేనని అన్నారు. తాను కెరీర్‌లో ఏ ఆఫర్‌నూ వదులుకోలేనని చెప్పారు.



## గాడ్ ఆఫ్ ఫియర్...దేవర-2పై అధికారిక ప్రకటన



టాకీస్: యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన చిత్రం దేవర. గతేడాది సెప్టెంబర్ 27న రిలీజ్ అయిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి కొరటాలకు సూపర్ కంబ్యాక్ సినిమాగా నిలిచింది. అలాగే బాలీవుడ్ హాట్ బ్యూటీ జాన్వీ కపూర్ కు టాలివుడ్ లో తొలి సినిమాతోన బ్లాక్ బస్టర్ ను తన ఖాతలో వేసుకుంది. రాజమౌళి సెంటిమెంట్ ను సైతం బ్రేక్ చేసిన హీరోగా ఎన్టీఆర్ సెన్సేషన్ చేసారు. కాగా ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందని గతంలోనే ప్రకటించారు. అయితే ఎన్టీఆర్ లైనప్ ను పరిశీలిస్తే దేవర 2 ఉండదనే చర్చ నడించింది. కానీ ఎట్టి పరిస్థితుల్లో దేవర 2 ఉంటుందని ప్రకటించడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అయ్యారు. ఇదిలా ఉండగా నేడు ఈ సినిమా రిలీజ్ అయి సంవత్సరం అయిన సందర్భంగా దేవర 2 గురించి కీలక ప్రకటన చేసారు మేకర్స్. ఈ సారి గాడ్ ఆఫ్ ఫియర్ రాబోతున్నాడు దేవర 2 కు రెడీ అవండి అని అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ఈ ప్రకటనతో నందమూరి ఫ్యాన్స్ జోష్ రెట్టింపయింది. ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఆ తర్వాత జైలర్ డైరెక్టర్ నెల్సన్ తో సినిమా చేయాల్సి ఉంది. అలాగే త్రివిక్రమ్ తో కూడా సినిమా చేయబోతున్నాడు. మరి ఈ గ్యాప్ లో దేవర2 ను ఎన్టీఆర్ ఎప్పుడు స్టార్ట్ చేస్తాడో చూడాలి. మరోవైపు దర్శకుడు కొరటాల దేవర 2 స్క్రిప్ట్ వర్క్‌ను ఫినిష్ చేసే పనిలో ఉన్నాడు.

## తుదిదశకు ది రాజాసాబ్ మూవీ చిత్రీకరణ

### 1న ట్రైలర్ విడుదల చేసే ఛాన్స్



టాకీస్: ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది రాజా సాబ్ మారుతి దర్శకత్వంలో రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని డిసెంబర్5 ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌ను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా ట్రైలర్‌ను విడుదల చేయబోతుందని తెలుస్తుంది. ఈ సినిమా ట్రైలర్‌ను దసరా కానుకగా.. అక్టోబర్ 1 న విడుదల చేయబోతున్నట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటించారు. బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కీలక పాత్ర పోషించారు. సప్తగిరి వీటీ-వీ గణేష్, ప్రభాస్ శ్రీనుతో పాటు బొమ్మన్ ఇరానీ తదితరులు ఇతర కీలక పాత్రలలో కనిపించనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకం మీద టీజీ విశ్వప్రసాద్, ఆయన కుమార్తె కృతి ప్రసాద్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## త్రిపుల్ ఎక్స్.. సీక్వెల్‌లో దీపికా పడుకొణె

టాకీస్: తుపాకులు.. అమ్మాయిలు.. రెండూ ఒకటే. ధైర్యంగా ప్రపంచాన్ని ఎదుర్కొంటాయి అంటూ 'ట్రిపుల్ ఎక్స్: రిటర్న్ ఆఫ్ జాండర్ కేజ్' అనే తన తొలి హాలీవుడ్ సినిమాతో అదరగొట్టింది బాలీవుడ్ తార దీపికా పదుకొణె. డీజే కరుసో తెరకెక్కించారు. ఈ స్పై యాక్షన్ చిత్రంలో విన్ డీసెల్, నినా డోబ్రేవ్, రూబీ రోజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. 2017లో విడుదలై భారీ వసూళ్లతో రికార్డు సృష్టించిన ఈ సినిమాకు ఇప్పుడు సీక్వెల్ రాబోతున్నట్లు- తెలుస్తోంది. ఇందులో కూడా



దీపికా పదుకొణె భాగం కానున్నట్లు- సమాచారం. ఈ కొనసాగింపు సినిమా చిత్రీకరణను దీపిక కోరిక మేరకు ముంబయిలో ప్రారంభించాలని సన్నాహాలు చేస్తుంది చిత్రబృందం. తన కుమార్తె కోసం ఆమె ఈ నిర్ణయం తీసుకుంది. త్వరలో దీనికి సంబంధించిన వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నారని దీపిక సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి మరోసారి హాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్న ఆమె సందడి ఎలా ఉంటుందో చూడాలంటే కొన్ని రోజులు ఎదురుచూడాల్సిందే.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.